ప్రజాశక్తి

Vol. 1, no. 8

(Aug. 5, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 8

(Aug. 5, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు: 0-1-6 PRAJA SAKTI Regd. No. M. 4486

ప్రజాశక్తి

చందావివరాలు	
సం॥ చందా	4-0-0
అర్థసం॥ ,,	2-0 0
విడిప్రతి	0-1-6

అడ్వర్ టైజు మెంటు రేట్లు	
పూర్తిపేజి	35-0-0
అరపేజి	18-0-0
పావు పేజి	10-0-0
కాలం అంగుళం	0-12-0

సంపాదకవర్గం:
మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు) ; : కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య; తుమ్మల వెంకట్రామయ్య; చలసాని వాసుదేవరావు

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టు పార్టీ
ఆంధ్ర కమిటీ పత్రిక

సంపుటి 1	బుధవారం 5-8-42 బెజవాడ	సంచిక 8

మన రాజకీయాలు

ఎల్లుండి ఏడవ తేదీన అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశం బొంబాయిలో జరుగుతుంది. నేటి సందిగ్ధావస్థలో మన జాతీయ నాయకులు భారతీయుల్ని ఎటు తీసుకువెళతారో ఆరోజున నిర్ణయించ బడుతుంది. యావద్భారత దేశం, భారత దేశమేకాదు, యావత్ప్రపంచమూ, ఎల్లుండి జరుగబోయే కాంగ్రెసు నిర్ణయం కొరకు రెప్పవాల్చకుండా నిరీక్షిస్తోంది.

రాబోయే పోరాటం

వల్లభ భాయిపటేలు, అహమ్మదాబాదులో విద్యార్థుల యెదుట ఉపన్యసిస్తూ, " రాబోయే పోరాటం గాంధీజీ నడిపించు పోరాటాలలో ఆఖరుది. అదిబాలా స్వల్పకాలంలోనే ముగించ బడుతుంది; కాని, అతివేగంగా నడుపడుతుంది. ప్రారంభమైన వారం రోజులలో పూర్తిఅవుతుంది" అన్నాడు. నెహ్రూ అలహాబాదులో ఒక పత్రికా విలేఖరుల సమావేశం యెదుట ఉపన్యసిస్తూ, రాబోయే ఉద్యమం దీర్ఘకాలంసాగదు, ఆచిరకాలంలోనే మిక్కిలి వేగంగా ముగియగలదు, అని తెలియ జేశాడు. బాబురాజేంద్ర ప్రసాదు పాట్నాలో, బీహార్ రాష్ట్రకాంగ్రెసు కమిటీయొక్క అత్యవసర సమావేశంయెదుట ఉపన్యసిస్తూ, యిలా అన్నాడు : "ఈసారి జైళ్లకు పోవడం మాత్రమే కాదు. అంతకంటె తీవ్రరూపంలో ఉద్యమం సాగుతుంది, అతి కఠినమైన నిర్బంధ విధానం యీ సారి అమలులో పెట్టబడుతుంది. తుపాకి కాల్పులు, బాంబులు వేయడం ఆస్థుల స్వాధీనం యివి అన్నికూడా సాధ్యమే. నిష్కళంకమైన అహింసా విధానంపై ఆధారపడే సత్యాగ్రహ పద్ధతులన్నీ యీ సారి ఆచరణకు వస్తాయి. ఇంతేకాదు, ఇదిభారత స్వాతంత్ర్య సంపాదనకై చేయబడే ఆఖరు పోరాటం."

గాంధీజీ కూడ వార్ధాలో ముగ్గురు విదేశ పత్రికా విలేఖరులతో సంభాషిస్తూ, యిలాఅన్నాడు: "బ్రిటిషు ప్రభుత్వం మీద గాని,మిత్ర మండలి పైగాని,ఎట్టి ఫలితం లేకపోతే, చిట్ట చివరి వరకూ నేను వెళ్లదలచుకున్నాను. అందులో ఏమీసందేహించను."

బ్రిటిషు వైఖరి : అమెరీ ప్రకటన

ఈ విధంగా జాతీయ నాయకులు సమిష్టి శాసనోల్లంఘనానికి సన్నాహాలు చేస్తుంటే అటు బ్రిటిషు వైఖరి యెలా వుందో చూదాం. పార్లమెంటులో ఒక సభ్యు డడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, యిండియా కార్యదర్శి అమెరీ యిలా చెప్పాడు.

"రాబోయే పరిస్థితిని యెదుర్కొనడానికి యిండియా ప్రభుత్వం తన కర్తవ్యాన్ని నెరవేర్చక మానదు, ఇది కాంగ్రెసు వర్కింగు కమిటీ యొక్క విధానాన్ని బలపరచే ప్రతివానికి ప్రభుత్వం యిస్తూన్న వార్నింగ్." ఇంతేకాదు. భారతీయ ప్రతినిధులతో మళ్ళీ సంప్రతించడానికి ప్రయత్నిస్తారా- అని ఒక సభ్యుడు అడిగితే "మా శక్తిలో ఉన్నంత వరకు మేము చేయవలసినవన్నీ చేశాము" అంటూ అమెరీ జవాబిచ్చాడు.

అధికారరీత్యా అమెరీ చేసిన యీ ప్రకటన బ్రిటిషు ప్రభుత్వం యొక్క నిరంకుశ సామ్రాజ్య విధానాన్ని తెలియజేస్తూవుంది. భారతీయుల స్వాతంత్ర్య కాంక్షను నాశనం చేయడానికి బ్రిటిషు ప్రభుత్వం సంకల్పించుకొంది అన్నమాట.

కమ్యూనిస్టుల పంథా

సమిష్టి శాసనోల్లంఘనం ప్రారంభమయితే కమ్యూనిస్టుల పంథా యేమిటని అనేకులు ప్రశ్నించుతున్నారు. ఆట్టి ఉద్యమంవల్ల దేశానికి స్వాతంత్ర్యం లభించకపోవడమే కాకుండా సామ్రాజ్యవాదుల నిరంకుశత్వాన్ని యెక్కువచేసి ఫాసిస్టు దుండగీడులను దేశంలోకి ఆహ్వానించడం ఔతుంది. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ప్రకటించిన జాతీయ వాంఛను కమ్యూనిష్టులు పూర్తిగా బలపరుస్తారు. "స్వాతంత్ర్యం లేని భారత దేశం మిత్రరాజ్యాల ఆశయ సిద్ధికి అడ్డు రావచ్చు" అంటూ గాంధీజీ చెప్పిన మాటలతో మేము యేకీభవిస్తాం. "భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తే దేశాన్ని సర్వవిధాలా రక్షించుకొంటుంది. ఆయుధాలతో కూడిన సైనిక బలంవల్ల, యితర మార్గా లన్నింటివల్ల, భారతీయులు స్వరక్షణ చేసుకొంటారు." అని జవహర్లాలు చేసిన ప్రకటన మాకు ఉత్సాహాన్ని యిస్తూవుంది. బొంబాయి బహిరంగ సభలో పటేల్ ఉపన్యసించినట్లు "సింగపూర్, మలయా, బర్మాలకు పట్టినగతి చూచిన తర్వాత కాంగ్రెసు యే నిర్ణయానికి వచ్చిందంటే భారత దేశ రక్షణ భారతీయుల సమస్య; బ్రిటిషు ప్రభుత్వానిదికాదు. స్వేచ్ఛ గలిగిన భారత దేశమే సర్వవిధాలా రక్షణ చేసుకో గల్గుతుంది."

కనుక, భారత దేశ స్వాతంత్ర్యాన్ని బ్రిటిషు ప్రభుత్వం నేడే గుర్తించాలనీ; తాత్కాలిక జాతీయ ప్రభుత్వం యివ్వాలని కమ్యూనిష్టులు అంగీకరిస్తారు.

పోరాటం : దాని ఫలితాలు

కాని, అందుకు మార్గం సమిష్టి శాసనోల్లంఘనం కానే కాదు. ఈ పోరాటం జయమొందితే, భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని అను కోవడం భ్రమ.

ఎందువల్లనంటే ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వంఅన్ని నిరంకుశపద్ధతులు అవలంబిస్తూ, ప్రపంచ ప్రజల యెదుట ఇది తప్పని సరి అనీ, ఫాశిష్టు వ్యతిరేక పోరాటంలో జయించ డానికి తాను తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూందనీ, ప్రచారం చేసుకుంటుంది. దేశంలోవున్న బ్రిటీషు ప్రతికూలతను ఆధారంగా జేసికొని అటు ఫాసిష్టు దుండగీడులు, పూర్వం కంటే సులభంగా దేశాన్ని స్వాధీనం చేసికోగల్గుతారు. ఫాసిష్టు రాజ్యాలతో మనం ఒడంబడిక కుదుర్చు కోవచ్చునని భ్రమించడమంత పొరపాటు యింకోటిలేదు. ఎందుచేతనంటే ఫాసిజం యొక్క సామ్రాజ్య తృష్ణకు అంతులేదు. "ఇండియాకు స్వాతంత్ర్యం వస్తే విదేశీదండ యాత్రఉండనేవుండదు ఎందువల్ల నంటే, విదేశీయుల దోపిడీ విధానానికి అప్పుడు అవకాశమే ఉండదు" అంటూ,అహమ్మదాబాదు బహిరంగ సభలో పలికిన వల్లభ భాయిపటేలు యొక్క మాటలు నేడు ఎంతైనా హాని గలుగ జేస్తాయి.

కాబట్టి శాసనోల్లంఘనం భారతస్వాతంత్ర్యాన్ని యివ్వదు అయితే, ఏది యిస్తుంది ?

జాతీయైక్యత, సర్వతోముఖమైన జాతీయైక్యత ఉంటేనే, ఫాసిష్టుల్ని ఎదుర్కొనడానికి శక్తిసామర్ధ్యాలు గల జాతీయ ప్రభుత్వం వస్తుంది. కాంగ్రెసు - ముస్లింలీగ్ ఒడంబడిక నేడు వెంటనే అవసరం అందుకై కాంగ్రెసునాయకులు తక్షణం కృషిచెయ్యాలి.

జాతీయైక్యత

ఫాసిస్టు వ్యతిరేక పోరాట కార్యక్రమంపై ముస్లిం-లీగ్ కాంగ్రెసు ఒక ఒడంబడిక కుదుర్చుకొంటే, సామ్రాజ్యవాదులు జాతీయ ప్రభుత్వాన్ని యివ్వక తప్పదు. బ్రిటిషు ప్రభుత్వం అనే మూడోపార్టి దేశంలో ఉన్నంత కాలం కాంగ్రెసు-లీగ్ ఐక్యత సాధ్యం కాదని గాంధీజీ "హరిజన్" పత్రికలో వ్రాస్తున్నాడు. ముస్లింలీగ్ కైనాసరే, మరి యే పార్టికైనాసరే బ్రిటన్ అధికారాన్ని స్వాధీనం చేస్తే కాంగ్రెసు సంస్థ ఉండ నవసరమేలేదు. అంటూ పటేలు తన ఉపన్యాసాలలో వాదిస్తున్నాడు. ఈవిధంగా చెట్టుముందా, విత్తుముందా ? అని తర్కించుకోవడంవల్ల దేశాన్ని ఆవరించియున్న ప్రమాదము అంతకంతకు మీదికివచ్చి ముంచివేస్తుంది.జిన్నాసహితం తాను సంప్రతింపులకు వ్యతిరేకి కానంటున్నాడు, "బ్రిటిషు వారు యీ దేశంలో ఉన్నంతకాలం ఒడంబడిక సాధ్యం కాదనడం తెలివిహీనం" అంటూ జిన్నా ప్రకటించాడు.

కాబట్టి వెంటనే మన కాంగ్రెసు నాయకులు శాసనోల్లంఘన తీర్మానాన్ని నిరాకరిస్తూ, లీగుతో సంప్రతింపులు ప్రారంభించాలి.

ప్రపంచ ప్రజల సానుభూతి

ప్రపంచ ప్రజల సానుభూతి కూడా మనపై పు వుంది. చైనా ప్రభుత్వాభిప్రాయాన్ని ప్రతిబింబించే "సెంట్రల్ డెయిలీ న్యూస్ పత్రిక" సంపాదకీయంలో యిలా వ్రాసింది.

"భారత దేశ స్వాతంత్ర్యానికీ, మిత్ర రాజ్యాల విజయానికీ, అవినాభావ సంబంధంవుంది....సంప్రతింపులు తిరిగి ప్రారంభిస్తే భారతీయులలో ద్వేష భావంపోయి, స్నేహభావం ఏర్పడుతుంది. అప్పుడు ఫాసిస్టు దురాక్రమణను ప్రతిఘటించడంలో వారు వస్తుసంపదను, ఉత్సాహాన్ని, సమీకరించ గలుగుతారు....ఇండియా - బ్రిటన్ల మధ్యగల సంబంధం యింకాపాడు కావాలని ఫాసిస్టులు మాత్రమే కోరుతున్నారు. ఒకరు శాసనోల్లంఘ నోద్యమం ప్రారంభించి, యింకొకరు క్రూర నిర్బంధ విధానం అవలంబిస్తే, యుద్ధం చేస్తున్న మిత్రరాజ్యాలకు నాశనంకలిగించే ఘోరవిపత్తు సంభవిస్తుంది"

అమెరికన్ కార్మిక వర్గం తరపున సి. ఐ. ఓ. అనే కార్మిక సంస్థ ఇండియాను గురించి తీర్మానించుతూ, యీ విధంగా ప్రకటించింది : "భారతీయులందరికీ ప్రాతి నిధ్యం వహించే తాత్కాలిక జాతీయ ప్రభుత్వం అవసరం. ఫాసిస్టు రాజ్యాలపై ప్రజలందరూ నేడుగావించే పోరాటంలో భారతీయులందరినీ సమీకరించడానికి యిది అత్యవసరం. భారతీయుల యీ కోర్కెను మేము బలపరుస్తున్నాము" ఇట్టి జాతీయ ప్రభుత్వాన్ని బ్రిటన్ స్థాపించి, మిత్రరాజ్యాల యుద్ధ చర్యలలో ఇండియాకూడ పూర్తిగాను. సమాన హోదాతోను పాల్గొనేటట్లు చూడాలని అమెరికన్ ప్రభుత్వాన్ని కోరుతూ పై సంస్థ తీర్మానించింది. (మిగతా ...వ పేజీలో)

ప్రజాశక్తి

5-8-42 బుధవారం

జాతీయ వాంఛ!

ఆగస్టు 6 వ తేదీ సభలు జరపండి

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆగస్టు 7వ తేదీన బొంబాయి లో సమావేశం కాబోతున్నది. ఇది భారత ప్రజా జీవితంలో అత్యంత క్లిష్ట సమయం. ఫాసిస్టు దుండగీడుల దండయాత్ర ప్రమాదం మన మాతృ భూమికి హెచ్చింది. ప్రపంచ ప్రజలు ఫాసిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా నిలబడి ఐక్యతతో పోరాడుతున్నారు. కాని బ్రిటిషు సామ్రాజ్యవాద నిరంకుశాధికారులు భారతీయులను సంకెళ్ళువేసి బానిసలుగా వుంచి, ప్రపంచ ప్రజా యుద్ధంలో భారత ప్రజలు తమ కర్తవ్యం నెరవేర్చకుండా అడ్డు తగులుతున్నారు.

దేశ భక్తులకు ఉచితమైన రీతిని యావద్భారత ప్రజలను సమీకరించి, మన మాతృభూమిని రక్షించుకోడానికి సాయుధంగా పోరాడాలని కాంగ్రెసు మహాసభ కోరుతోంది.

స్వాతంత్ర్యాన్ని ప్రేమించే ప్రపంచ ప్రజలతో కలసి భారత ప్రజలు ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలనీ, ప్రపంచ స్వాతంత్ర్యాన్ని, అందులో భాగమైన భారత స్వాతంత్ర్యాన్ని సాధించాలని కాంగ్రెసు మహాసభ కోరుతూంది. ఫాసిజానికి, సామ్రాజ్య వాదానికీ పూర్తిగా వ్యతిరేకమైన పంథాను అవలంబించి, మన జాతీయోద్యమ సాంప్రదాయాలను నిలబెట్టింది.

మన జాతీయ, అంతర్జాతీయ ఆశయాలను సాధించటానికి అడ్డుగావున్న ఆటంకాలను తొలగించాలని కాంగ్రెసు మహాసభ కోరుతూంది. అందుకొరకే భారత దేశ స్వాతంత్ర్యం, గుర్తించబడాలనీ, తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలనీ కోరుతూంది.

స్వాతంత్ర్యాన్ని కాంక్షించే ప్రతి భారతీయుడూ, దేశభక్తి కలిగిన ప్రజలందరూ పై కోర్కెలను బలపరుస్తారు. నిరంకుశ ప్రభుత్వోద్యోగులు కొలదిమంది ఒకవైపునుండి, ఓటమి తత్వాన్ని బోధించే నిరుత్సాహులు కొంతమంది మరియొకవైపునుండి, వ్యతిరేకించుతారు. దేశంలో ప్రధాన రాజకీయ సంస్థ అయిన జాతీయ కాంగ్రెసు వెంటనే చొరవజేసి, మన జాతీయ వాంఛను బలపరుస్తున్న దేశభక్తులందరిని, ప్రజా సంస్థ లన్నిటిని ఏకీకృత మొనర్చి జాతీయైక్యతను నిర్మించాలి. తద్వారా ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని అకుంఠిత ధైర్యాన్ని, కృతనిశ్చయాన్ని పెంపొందింప జేయాలి. అపుడే మన దేశప్రజలు స్వాతంత్ర్యం కొరకు ఎదురులేని బలాన్ని, ఐక్యతను ప్రదర్శించ గలుగుతారు.

ప్రస్తుత విషమావస్థను ఎదుర్కొ(న)డానికి కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఏమి సూచించుతూంది? జాతీయ వాంఛలకు అందగా జాతీయ ఐక్యతను సాధించడం అసాధ్యమని వర్కింగ్ కమిటీ అంటూంది. ఇలా అనడం మన ప్రజలయందు, వారి శక్తియందు నమ్మకం లేకపోవడాన్ని మాత్రమే తెలియ జేస్తుంది. దేశభక్తి తమ ఒకరి ముల్లె అనుకునే సంకుచిత స్వభావాన్ని మాత్రమే తెలియ జేస్తుంది. మన దేశప్రజలు ఐక్యతతో మన జాతీయ వాంఛలను బలపరిస్తే, యునైటెడ్ నేషన్సు ప్రజలు కూడ మన జాతీయ వాంఛలను బలపరుస్తారనీ, మన స్వాతంత్ర్యం తక్షణం సంపాదించ గలమనీ వర్కింగ్ కమిటీ నమ్ముటలేదు. మన ప్రజలలో విశ్వాసం లేకపోవుటయే ప్రపంచ ప్రజలలో విశ్వాసం లేకపోవడానికికూడ కారణమవుతూంది.

అందుచే, కాంగ్రెసు వర్కింగ్ కమిటీ యిపుడు జాతీయ ఆశయ సిద్ధి కొరకు "అహింసాయుత" పోరాటం ప్రారంభించాలంటూంది. స్వాతంత్ర్యం సాధించిన తరువాతనే సామ్రాజ్యవాద నిరంకుశాధికారుల ఆటంకాలు లేకుండా మన మాతృదేశాన్ని ఫాసిస్టు దురాక్రమణదారులనుండి రక్షించుకోడం సాధ్యమవుతుందంటూంది.

కాని అట్టిపోరాటంనుంచి వచ్చే ఫలితాలు ఎలావుంటాయి? మన జాతీయ శక్తులు యింకా బలహీన పడుతాయి. అంతర్జాతీయంగా మనకు-మన అంతర్జాతీయ మిత్రులకు-మధ్య అఘాతం ఏర్పడుతుంది. జాతీయంగా, కాంగ్రెసువాదులు దేశభక్తుల కోర్కెలకు ఆచరణలో విరుద్ధంగా జరుగుతుంది. జాతీయ ఐక్యతకు గాక జాతీయ విచ్ఛిన్నతకు దారితీస్తుంది. దేశరక్షణకు గాక, దురాక్రమణకు దారి తీస్తుంది. స్వాతంత్ర్యానికి గాక ఫాసిజానికి దారితీస్తుంది.

అందుచేతనే కమ్యూనిస్టులం కాంగ్రెసు నాయకుల పంథాను వ్యతిరేకించుతున్నాము. ఏమంటే వారి పంథా మన బలాన్ని వృధా పరుస్తుంది. అది స్వాతంత్ర్యం కొరకు పోరాడటంకాదు. యుద్ధరంగాన్నుంచి తప్పుకొని జైలుకు పోవడం మాత్రమే. నిరంకుశాధికారుల పెత్తనాన్ని అది తొలగించదు. పైగా వారి చేతులు బలపరుస్తుంది. అందుచేతనే కమ్యూనిస్టులం, కాంగ్రెసు నాయకులకు, ప్రజలకు వర్కింగ్ కమిటీ చూపుతున్న ఈ ఆత్మహత్యాకరమైన మార్గాన్ని అనుసరించవద్దని నచ్చ చెప్పుతాము.

మేము జాతీయ వాంఛల నాధారం చేసికొని, జాతీయైక్యత సాధించాలంటాం. ఫాసిస్టు దుండగీడులకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటిత పరచా లంటాము. స్వాతంత్ర్యం, డెమాక్రసీకొరకు వీరులగు సోవియటు ప్రజలతో, చైనా ప్రజలతోనూ, ప్రపంచ ప్రజలతోనూకలసి భారత ప్రజలు పోరాడాలంటాము. మాది ఒకేఒక సరియైన మార్గం గాన తప్పక జయించితీరుతాము. మా పంథా అనుసరించుటద్వారా నిరంకుశాధికారులను, విద్రోహక శక్తులను ఓడించగల్గుతాము. అభివృద్ధి శక్తులను బలపరుస్తాము. తమ ప్రయోజనాలకొరకు, ఆదర్శాల కొరకు పోరాడుతున్న ప్రజలు మాపక్షాన వున్నారు. అందుచే మేము జయించుతామనే విశ్వాసం మాకుంది.

ఇదొకటే భారత స్వాతంత్ర్యాన్ని సాధించడానికి మార్గం. దీని ద్వారానే మన ప్రజా బలాన్ని వృద్ధి చేసుకొన గల్గుతాము. దేశరక్షణ కొరకు, భారత స్వాతంత్ర్యంకొరకు, దేశ ప్రజాఐక్యతను సాధించ గల్గుతాము.

రేపు ఆగష్టు 6వ తేదీన జరిపేసభలు ప్రదర్శనాలలో భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించాలనీ, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలనీ కోరే జాతీయ వాంఛను కమ్యూనిష్టులం బలపరుస్తాము. జాతీయ వాంఛలను నెరవేర్చుకోడానికి ఒకే ఒక మార్గమైన ప్రజా ఐక్యత అవసరాన్ని గురించి, యునైటెడ్ నేషన్సుతో భారత దేశ ఐక్యత అవసరాన్ని గురించి, ప్రజలకు నచ్చ చెప్పుతాము. అఖిల భారత కాంగ్రెసు కమిటీలో ఆత్మహత్యాకరమైన వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని త్రోసి వేయమని విన్నవించుతాము. ఓర్పుతో మాసోదర స్వాతంత్ర్యయోధులు మనదేశానికి రానున్న ప్రమాదాన్ని గుర్తించునట్లు చేస్తాము. దేశప్రజాఐక్యత సాధించుటద్వారానే జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించగలమనీ, ఫాసిస్టు దుండగీడులనుండి భారతభూమిని రక్షించుకొని భారత స్వాతంత్ర్యాన్ని, ప్రపంచస్వాతంత్ర్యాన్ని స్థాపించగలమని భారత దేశ భక్తులకు నచ్చచెప్పుతాము.

బ్రిటిష్, అమెరికన్ కమ్యూనిస్టులకు

కామ్రేడ్ జోషీ తంతి

భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పి.సి. జోషీ, అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎరల్ బ్రౌడర్‌కి యీ క్రింది తంతిని పంపారు.

"నిషేధం తొలగించబడిన మాపార్టీ తరపున అమెరికన్ కామ్రేడ్స్‌కి మా అభివందనాలు. మలయా, బర్మాల గుణపాఠాన్ని బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వం గుర్తించడం లేదు. నిజమైన జాతీయ ప్రభుత్వం లేనిదే భారత దేశాన్ని జయప్రదంగా రక్షించడం సాధ్యం కాదు. మేము యీ క్రింది కోర్కెలకై ప్రజాందోళన ప్రారంభిస్తున్నాం.

ఏకోన్ముఖ జాతీయ ప్రతిఘటనకై సర్వతోముఖ ఐక్యత, జాతీయ ప్రభుత్వ సంపాదనకు కాంగ్రెసు-లీగ్ ఐక్యత, భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించి జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించేలాగు మా కాంగ్రెసుతో బ్రిటిషు ప్రభుత్వం సంప్రదించాలని మీ అధ్యక్షుని కోరుతూ అమెరికా అంతటా ఆందోళన సాగించ గోరుతాను;

గాంధీజీ యొక్క విశ్వశాంతి నినాదాన్ని యెంతోమంది అంగీకరించరు. నెహ్రూ, ఇతర నాయకులు, పూర్తియైన ఫాసిస్టు వ్యతిరేకులు. ప్రపంచ ప్రజా తంత్ర శక్తులకు వారు చేయూత యిస్తారు. ఫాసిస్టు దురాక్రమణదారులపై వీరు సాయుధ జాతీయ ప్రతిఘటనను నడిపించడానికి అనుకూలురు. భారతదేశపు భవిష్యత్తుపై మీ భవిష్యత్తు కూడా ఆధారపడి యున్నదను సంగతి మీ దేశీయ ప్రజలు గ్రహించేటట్లు ఆందోళన చేయ గోరెదను. కలిసి మనం స్వేచ్ఛా ప్రపంచాన్ని, మానవ భ్రాతృత్వాన్ని స్థాపించుదాం. ఇప్పుడే ప్రారంభిద్దాం."

భారత కమ్యూనిస్టు పార్టి కార్యదర్శి పి.సి. జోషి బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి అయిన హారీపాలిట్‌కి యీ క్రింది తంతిని పంపించారు.

"నిషేధం తొలగించబడిన భారత కమ్యూనిస్టుపార్టి తరపున బ్రిటిషు కామ్రేడ్సుకు అభివందనాలు. స్వాతంత్ర్య ప్రియులైన మానవజాతి యొక్క జీవితంలో నేడు ప్రమాద దశ ఆసన్నమయింది. జాతీయ ప్రతి ఘటనకు జాతీయైక్యత;జాతీయప్రభుత్వంకొరకుజాతీయైక్యత, ఇదినేడు మేమవలంభించిన విధానం. మలయా బర్మాలలో జరిగిన సంఘటనల తరవాత కూడా సామ్రాజ్యవాద ప్రభుత్వం చూపే మొండి పట్టుదలవల్ల మాతోడి దేశభక్తులు స్వవినాశనకరమైన పద్ధతులకు దారితీస్తున్నారు. అక్కడ మీప్రభుత్వం భారత స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తూ తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించే నిమిత్తం కాంగ్రెసుతో సంప్రతింపులు జరిపే మీరు మీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవలసిఉంది ఇది మీ కర్తవ్యం, ఇక్కడ మా కర్తవ్యం, కాంగ్రెసు లీగ్ ఐక్యత కొరకు, బ్రిటన్‌తో రాజీకొరకు, ఫాసిస్టు దురాక్రమణను ఎదుర్కొనేటందుకు, జాతీయ నాయకత్వాన్ని తెప్పించడం. మీ పని మీరు చేస్తున్నారని మాకు తెలుసు. మేముకూడా మాకర్తవ్యాన్ని నెరవేర్చడానికి నడుములు కట్టాం. మీ ప్రజాందోళనను నూరు రెట్లు ఎక్కువ జేయండి కలిసి మనం విజయాన్ని సాధించాలి. మన రెండు దేశాల ప్రజలు సోదర సైనికులుగా పోరాడేటట్లు వారిమధ్య ఐక్యత సమకూర్చాలి. ఫాసిస్టు ప్రతి కూల స్వాతంత్ర్య రంగంలో మీరు, మేము, కలిసి యుద్ధం చేయాలి."

రష్యన్ యుద్ధరంగ సంఘటన

ద్వేషం! ద్వేషం!!

యుద్ధరంగంలో మాకై నిర్మించబడ్డ ఒక సొరంగంలో నేను కూర్చున్నాను. మాకూ, శత్రు సేనలకూ, మధ్య బురదప్రదేశం ఒకటీ, చిట్టడవి ఒకటీ, ఉన్నాయి. బురద ప్రదేశం చిన్నదైనా, లోతుగా వుంది. చిట్టడవి ఫాక్ తూటాలతో కప్పబడి యుంది. మాకు 2 ఫర్లాంగుల దూరంలో ఉన్న ఒక మెట్ట ప్రదేశము మీద ఒక గ్రామం వుంది. ఆ గ్రామపు పొలిమేరలోనే జర్మను సైన్యాలు.

అకస్మాత్తుగా సొరంగపు తలుపు తెరవబడింది. ఒక రెడ్‌ఆర్మీ సైనికుడు ప్రవేశించాడు. తన దుస్తులమీది వాన నీరు గట్టిగా దులుపుకొంటూ లోపలికి వచ్చాడు. ఏదో కంగారుగా, మతిపోయినవాడిలా కనపడ్డాడు.

"ఏమోయ్! యేం జరిగింది? చెప్పు" అని అతనిని మా లెఫ్టినెంటు క్యారీ ప్రశ్నించాడు. "కామ్రేడ్ లెఫ్టినెంట్! ఒకసారి నీ దుర్భిణీ యంత్రం తీసి అటుచూడు. ఆ వెధవ పందులు యిప్పుడేమి చేశారోచూడు!" అంటూ అతడు కోపం ఆపుకోలేకపోయాడు.

మేము బయటికి వచ్చాం. రెడ్‌ఆర్మీ సైనికుడు నన్ను దగ్గరగా లాక్కొని, జర్మనులు వున్న మెట్ట ప్రదేశంవైపు చూపించాడు.

"చూడు, ఆ లాంతరు స్తంభంమీద...."

కనపడింది. కళ్ళకు కట్టినట్లు స్పష్టంగా కనపడింది, మేము ఆ దృశ్యం చూచి కంపించిపోయాం. ఒక కళేబరం లాంతరు స్తంభం మీద వేళ్ళాడుతోంది. అదొక స్త్రీ శరీరము. గాలిలో అది యిటూ, అటూ ఊగుతోంది, ఆ పని రాత్రి జరిగియుండాలి.

క్రోధాగ్ని

రెడ్‌ఆర్మీ సైనికులు తమ తమ సొరంగాలలో నుంచి బయటికి వచ్చారు. ఈ దృశ్యం చూచి, అందరూ పిడికిళ్ళు ముడిచి కోపంతో కేకలు ప్రారంభించారు. ఫాసిస్టు రాక్షసులు చేసిన యీ కిరాతక చర్యను చూచి సహించలేకపోయారు.

"ఆ పందులపైకి ఉరుకుతే యెంత బాగుండును!"

"తక్షణమే మనం వాళ్ళమీద పడాలి!"

"ఓ నరాధముల్లారా! ఆగండి. తొందర పడకండి!"

అంటూ అందరూ తమ తమ క్రోధాగ్నిని వెళ్ళగ్రక్కుతున్నారు.

ఇంత వానలో యేమీ ఫరవాలేదనే ధైర్యముతో అటు జర్మన్లు తమ తమ సొరంగాలలోను, గ్రామమందలి గుడిసెలలోను హాయిగా కాలం గడుపుతున్నారు. రెడ్‌ఆర్మీ సైనికులు ఒక్కరొక్కరుగాను, సమూహాలుగాను తమ తమ ఉన్నతాధికారుల వద్దకు యీ వానలో వెళ్ళుతున్నారనీ, ఆ గ్రామంనుంచి జర్మన్లను తరిమివేయడానికి అనుమతి అడుగుతున్నారనీ పాపం యీ జర్మన్లకు యేమి తెలుసు! నిశ్చింతగా కాలం గడుపుతున్నారు.

వెంటనే ఆ సాయంకాలమే తుపాకులు, ఫిరంగులు సిద్ధం చేయబడ్డాయి. రాత్రి బాగా చీకటిపడ్డాక మూడు వాలంటీరు దళాలు రైఫిళ్లు, గ్రెనేడ్సు (చేతితో విసరు చిన్న బాంబులు) బాకులు పుచ్చుకొని జర్మన్ సేనలవైపు బయల్దేరారు. జర్మనీ వారిపై గుండ్ల వర్షం కురిపించారు. అయినప్పటికి రష్యన్ వాలంటీరుదళాలు తెగింపుతో ముందుకు తోసుకుంటూ వెళ్ళాయి. జర్మన్ల కందకాలలో దుమికి, హోరా హోరీగా ముష్టియుద్ధం ప్రారంభించాయి.

మనవాళ్ళు పెద్ద పులుల మాదిరిగా యుద్ధం చేశారు. జర్మన్ల సమూహం ఒకటి తనను చుట్టుముట్టివేయడం చూచి, ఐవాన్ లొబనోవ్ అనే పేరుగల ఒక రష్యన్ రెడ్ఆర్మీ సైనికుడు వీరోచితమైన పనిచేశాడు. శత్రువును తనకు బాగా దగ్గరగా రానిచ్చాడు. రానిచ్చి తన పాదాలముందు ఒక బాంబు పేల్చివేశాడు. చాలామంది శత్రు పక్షంవాళ్ళను హతమార్చడానికి తాను తన ప్రాణాలు త్యాగం చేశాడు.

జార్జి ఫెడ్యూనిన్ మరొక రెడ్ఆర్మీ సైనికుడు, యువకుడు. గ్రామం ప్రవేశించిన వాళ్లలో ఇతడొకడు. యుద్ధం చేయడానికి యిదే మొదటిసారి. అతని జీవితంలో మొదటియుద్ధం ఇదే. ఎంతోమంది జర్మన్ సైనికులు కలిసి ఒక మరఫిరంగిని ప్రయోగించ బోతున్నారు. జార్జి కంగారు పడక, వారిపై ఒక బాంబు గురి చూచి విసిరాడు. ఆదెబ్బతో గుంపు అంతా నాశనం అయింది!

ఫెమ్యూనిన్ ఇంతటితో ఊరుకోలేదు. మరొక మూల తన సహచరులైన కొందరు రెడ్ ఆర్మీసైనికులు కొంత మంది ఫాసిస్టుల్ని సన్నీలతోను, రైఫిల్ మడమలతోను, ఎదిరిస్తూండటం చూచాడు, పైచేయి తన కామ్రేడ్సుదే అని చూచాడు.

"అదీ దెబ్బ అంటే; చంపు పందుల్ని!"

అంటూ అరిచాడు ఫెమ్యూనిన్. వెంటనే, పక్కనున్న ఒక ఫేసిస్టు కళేబరం చేతులో పిస్టలు తీసి దాన్నిపైకి ఎత్తుతూ ఒక్కపరుగున ఆపోరాటం మధ్యదుమికాడు.

జర్మన్లు తోకముడిచారు

ఇక యెదుర్కొవడం నిష్ప్రయోజనం అని జర్మన్లు తెలుసు కున్నారు. వెంటనే కాళ్లకు బుద్ధి చెప్పారు. అయితే, రెడ్ ఆర్మీ సైనికులు వారిని అంత సులభంగా విడిచిపెట్టదలచుకోలేదు. ఆలాంతరు స్తంభం మీద యిటూ అటూ ఊగుతూన్న శవం వారి కళ్లయెదుటి నుంచి తొలగిపోలేదు. వారిని ముందుకు త్రోసేది అదృశ్యమే, తోక ముడిచి పారిపోతూన్న జర్మన్లను రెడ్ఆర్మీ సైనికులు విడువకుండా తరుముతున్నారు, అప్పుడు లెఫ్టినెంట్ క్యారీ కనిపించి, యీ విధంగా ఆజ్ఞాపించాడు :-

"అఖరు మనిషి చచ్చేదాకా యుద్ధము చేయండి! లొంగిపోయే వరకు విడిచి పెట్ట వద్దు."

యుద్ధం ముగిసింది. కొంతసేపటి తరవాత నేను, ఫెట్యూనిన్ పిచ్చా-పాటీ మాట్లాడుకొంటున్నాం. అతని ధైర్య సాహసాలకు అందరూ అతన్ని మెచ్చుకున్నారు. ఈ ఆర్భాటం చూచి పాపం ఆ అమాయక యువకుడు చీకాకు పడ్డాడు.

"అందరిమాదిరిగానే నేనూ పోరాడాను. అంతే. కాని నేను ఒక విషయానికి విచారిస్తూవున్నా. ఆ గాడిదకొడుకుల్లో ఒక యినప టోపీకి నా రైఫిల్ మడమ తగిలి, ముక్కముక్కలైపోయింది...." అన్నాడు.

లెఫ్టినెంట్ చిరునవ్వు నవ్వుతూ యిలా అన్నాడు. "అయితే నువ్వు మాత్రం సామాన్యుడివా? అంత గట్టిగా నువ్వు కొట్టావన్నమాట! ఆ యినపటోపీ ధరించిన మానవుడు యేమయాడో, పాపం! ఆ పిస్టల్ నీకు ఆ సమయంలో దొరకడం అదృష్టమే సుమా అది నీ దగ్గిర లేకపోతే యేమి జరిగి యుండేదో!"

ద్వేషం! ద్వేషం!

ఫెడ్యూనిన్ తన కొత్త రైఫిల్‌ని గట్టిగా పట్టుకొంటూ యిలా జవాబు చెప్పాడు,

"ఆ పశువుల్ని హతమార్చడానికి నేను యేదో ఒకటి చేసి యుండేవాణ్ణి. ప్రాణాలతో వాళ్ళు పారిపోవడము నా కెంతమాత్రమూ యిష్టంలేదు."

ఆ యువకుని ముఖం చూస్తే స్టాలిన్ మే దినోత్సవంనాడు చెప్పిన యీ క్రింది మాటలు నాకు జ్ఞాపకం వచ్చాయి.

"మన సైనికుల క్రోధం, ఆవేశం, ఎక్కువౌతున్నాయి. జర్మను ఫాసిస్టు దండ యాత్రీకుల్ని వారు నిజమైన ద్వేషంతో ద్వేషించడం నేర్చుకున్నారు." (మాస్కో న్యూస్‌నుండి)

★ రణ రంగానికి

(పరుగిడురా తనయా మాదిరి)

రారా తమ్ముడ రణ రంగానికి
రాక్షసత్వమును నిర్మూలింపగ
కవచధారివై,
ఖడ్గధారివై — రా, రా,
వీర గంధమున మేను పొంగగా
వీర కంకణము ధారణ చేయగా
వీరుల గాథలు ఉద్బోధలుగా,
లక్షణ మందిని ప్రోత్సహింపగా॥రారా॥
ఫాసిస్టులపై కత్తి దూయరా,
పంచమ దళముల నొక్కివేయరా
ప్రజాశక్తి అప్రతిహతమ్మురా
ప్రపంచ శాంతిని నిలువబెట్టగా ॥రారా॥
అదిగో జపాను, అదిగో జపాను
ఆంధ్ర దేశమున నత్యాచారము,
ఆత్మ శక్తితో ప్రతిఘటింపవా?
కాకినాడలో, విశాఖ పురమున,
అమాయకులపై విమానదాడి
భారత వీరులపై సవాలురా,
పరిభవమ్మునెటు సహించెదవురా?॥రారా॥
వేడి రక్తమున కెలకవుట్టదా?
నేడీ స్థితిలో నూరకుందువా?
దురాక్రమణకై దోపిడీలకై
ప్రపంచ శాంతిని భంగించుటకై
ప్రపంచ రంగాధిపత్యమునకై
విపత్సూచికము జపాను రాకడ ॥రారా॥
మనవాడేగా — మన తోడేగా,
మన యిరుగేగా, మన పొరుగేగా,
మరీ మంచిదని యూరకుందువా?
మన ప్రాచ్యుండని యుపేక్షింతువా?
ఇంటి దీపమని ముద్దుగొందువా?
తంటానుమ్మీ - తడయక రమ్మీ! ॥రారా॥
రష్యా, చైనా, బ్రిటను, అమెరికా
ప్రజా స్వామ్యముల పర్యవేక్షణ
ప్రపంచోన్నతికి సాధనంబుగా
ఫాసిజమ్మునకు వ్యతిరేకముగా
ప్రపంచ యుద్ధము సాగిం దదిగో,
ప్రపంచ యుద్ధము ప్రజా యుద్ధమే,
॥రారా తమ్ముడ॥

—అయ్యపు వెంకటకృష్ణయ్య

కార్మిక సమస్యలు

రాజమండ్రి పేపరుమిల్లు కార్మికులు

ఆంధ్ర పేపరుమిల్లు పనివారల మహా సభ జులై 19 తేదీ సాయంకాలం తిరుపతిరాయ కాంగ్రెసు భవనంలో శ్రీ అరవ ఆదినారాయణమూర్తిగారి అధ్యక్షతను జరిగింది. 200 మంది కార్మికులు ప్రజాయుద్ధ నినాదాలతో ఊరేగింపుతో సభకు వచ్చారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు పుసులూరి కోదండ రామయ్యగారు పేపరుమిల్లు తిరిగి తెరువబడాలంటే అది ప్రజాబలం ద్వారానే సాధ్యమవుతుందనియు, గవర్నమెంటు తన పెట్టుబడితో మిల్లు నడపాలనియు నుడివారు. ప్రారంభకులు తడవర్తి చెంచు పున్నయ్యగారు కార్మికులతోపాటు ప్రజలంతా ఆందోళన జేసి మిల్లును తెరిపించాలని చెప్పారు. అధ్యక్షులు మిల్లు చరిత్రను వివరించారు.

ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాని కవసరమైన పేపరును తయారు చేయాలిగాన, యీ మిల్లును ప్రభుత్వం వశపర్చుకొని నడపాలనియు, ప్రస్తుత ప్రపంచ ప్రజా యుద్ధంలో కార్మికులు పాల్గొని జపాన్ దురాక్రమణను జయప్రదంగా నిరోధించుటకు నడుము కట్టాలనియు, ధరల కంట్రోలును గురించియు, తీర్మానాలు చేయబడెను. ఒక రాయబార కమిటీ ఎన్నుకోబడెను.

కాకినాడ

స్టీవ్‌డోర్ కార్మికులు

స్టీవ్‌డోర్ పనిఆగిపోయి నిరుద్యోగులయిన కార్మికులకు మ్యునిసిపాలిటీ యిచ్చిన పని పూర్తి అయిపోయింది. కార్మికులు ఆకలితో అల్లలాడుతున్నారు. స్టీవ్‌డోర్ కూలీల సంఘం పని చూపాలని ఆందోళన చేస్తూంది.

నెం 116 పడవలో దెబ్బతగిలిన నొల్లు తాతమ్మ అనే పడవవానికి రు 112 నష్ట పరిహార మివ్వాలని లేబరు కమీషనరు తీర్పు చెప్పాడు. కాని యజమాని ఇంతవరకు సంవత్సరమయినా డబ్బు యివ్వకుండా యాతన పెట్టుతున్నాడు.

ఏలూరు

వర్తక గుమాస్తాల సంఘం

జులై 13 వ తేదీ పై సంఘ వార్షికోత్సవం తటవర్తి కృష్ణమూర్తిగారి అధ్యక్షతను జరిగింది. ఊరేగింపులో 600 మంది పాల్గొన్నారు. సభను ప్రారంభించిన కామ్రేడ్ తమ్మిన పోతరాజు సంఘ ఆవశ్యకతను గురించి ఉపన్యసించారు. కట్టా సుబ్బారావుగారు యుద్ధభత్యాలు యివ్వాలని చెప్పారు.

1941 డిశంబరులో ప్యాసయిన "వారానికొకరోజు శెలవు" ఆక్టును అమలు జరుపాలని మద్రాసు గవర్నమెంటును కోరుతూ తీర్మానించబడెను.

అధికలాభాల దోపిడిని అరికట్టాలి

కామ్రేడ్ చలసాని వాసుదేవరావు

అధిక ధరల సమస్య నేడు ప్రజాసామాన్యాన్నంతటిని ఆందోళన పరుస్తూంది. ప్రజల జీవితానికి అవసరమైన వస్తువుల ఖరీదులు విపరీతంగా పెరిగాయి. బీదసాదలకు తినుబడి పదార్థాలు కూడా దుర్లభమవు తున్నాయి. ఎటు చూచినా కరువు. ఆకలి హాహాకారాలు చెలరేగుతున్నాయి.

గత చరిత్ర

గత కార్తీక మాసంలో (1941 నవంబరు) ఇలాంటిపరిస్థితియే సంభవించి బెజవాడ వగైరా పట్టణాలలో కరువు దోపిడులు జరిగాయి. వర్తకులు ఫిర్లి దుకాణాలు పూర్తిగా మూసివేయడం వలన వర్తకం మందగించి, ముఖ్యంగా ముడి సరుకుల ఖరీదులు తాత్కాలికంగా పడిపోయాయి, కాని ఆలోచించి చూస్తే యీ ఆకలి దోపిడుల వలన వర్తకులు మొత్తం మీదఏమీ నష్టపడలేదు. పైగా హెచ్చులాభాలు పొందారు. ఏమంటే 1941 నవంబరులోఅనగా దోపిడులకు ముందు రానున్న వరిపంటకు బస్తా 1 క 8 రూ చొప్పున జట్టీలు కొంటున్నారు. కానిదోపిడులుజరిగిన వెంటనేఖరీదులు పడిపోయాయి. రైతులు శిస్తులు చెల్లించ వలసిన జనవరి ఫిబ్రవరి మాసాలలో ధాన్యం అమ్మబోతే బస్తా 1 కి రూ 6 మించి ఖరీదు రాలేదు ఎప్పుడైనా బీదరైతులకు గత్యంతరం లేక తక్కువ ఖరీదులకే అమ్ముకొన్నారు.

అటు తరువాత వైజాగ్, కాకినాడలపై బాంబులు పడిన సమయంలో కూడ రవాణా ఆగిపోయి పండించిన రైతులు తక్కువ ఖరీదుకే అమ్ముకోవలసి వచ్చింది. ఏమైతే నేమి, బీద రైతుల నుండి తక్కువ ఖరీదులకే ధాన్యం వగైరా ముడిసరకులు షావుకారుల వద్ద, భూస్వాముల వద్ద నిలువచేయ బడ్డాయి. ఇప్పుడు వానినే తిరిగి వీరు విపరీత ఖరీదులకు బియ్యం బస్తా 20 - 21 రూ వరకు అమ్మి అమితలాభాలను పొందు తున్నారు. అపరాలు అప్పుడు 10రూ. లోపుగా కొని యిప్పుడు 20రు. పైగా అమ్ముతున్నారు. అల్లాగే విదేశాలనుండి వచ్చేసరకులు, పారిశ్రామిక సరుకులు కూడ విపరీతపు ఖరీదులకు అమ్మబడు తున్నాయి. కాగితం ఖరీదు 5 రెట్లు పెరిగింది; నిప్పెట్టెలు రెట్టింపుకు అమ్మబడుతున్నాయి.

ప్రభుత్వం ఏమి చేసింది ?

అయితే ఈ విషమావస్థనుండి బీదలను రక్షించే మార్గం ఏమిటి ? ప్రభుత్వం అందుకొరకు ఏమిచేసింది ? ఇండియా ప్రభుత్వం కాన్ఫరెన్సులపై, కాన్ఫరెన్సులు జరిపింది. రాష్ట్రప్రభుత్వాలతోనూ, వర్తక సంఘాలతోనూ మంతనాలు జరిపింది, అవసరమైతే ధరల కంట్రోలు చేయవలసిందే నని తీర్మానం మాత్రం చేసింది. దానిని అమలు జరిపే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు యిచ్చింది. మద్రాసు ప్రభుత్వం బియ్యం వర్తకులకు లైసెన్సింగు పద్ధతి పెట్టింది. పంచదార, కాగితాలు, నిప్పెట్టెలు, కిరొసిన్, గోధుమలు వగైరా ఖరీదులు నిర్ణయించుతూ ప్రభుత్వం ప్రకటన చేసింది.

కాని ఆచరణలో యివేవీ అమలు జరుగుట లేదు. నిప్పెట్టె ఖరీదు 5 పైసలు అని ప్రభుత్వం కంట్రోలు పెడితే 6 పైసలు బహిరంగముగానే అమ్మబడుతూంది. తెల్ల కాగితాలు దస్తా 1కి 0-3-9 కంట్రోలు ఖరీదు అయితే 6 అణాలు అమ్మబడుతూంది. కిరోసిన్ డబ్బాడు 7 లు అమ్మబడుతూంది, తక్కిన సరుకులు కూడా అంతే, ఈ వ్యాపారమంతా బహిరంగంగానే జరుగుతూంది. ప్రభుత్వం ఒక ప్రకటన జేసి చేతులు దులుపుకొని కూర్చుంది. ప్రభుత్వోద్యోగులు తమ కండ్లయెదుట జరుగుతున్న యీ బహిరంగ దోపిడిని ఎరిగివుండీనీ కండ్లు మూసుకొని సహించుచున్నారు వారికి షావుకారులలో మంచిగా వుండేనే ఏమైనా గిట్టుబుంది. అందుకనే నేడు బహిరంగంగా జరుగుతున్న యీ దోపిడి మార్కెటును సాగనిస్తున్నారు. తత్ఫలితంగా ప్రజా సామాన్యం నానా బాధలు పడుతూంది. ఈ పరిస్థితులు యిలాగే సాగితే 1941 అక్టోబరు, నవంబరులలో జరిగిన కరువు దోపిడులు యింకా హెచ్చుస్థాయిలో జరుగుతాయి. ఇప్పుడు అధిక లాభాల దోపిడిని నోరు మూసుకుని సహించుతున్న నిరంకుశ ఉద్యోగులు. అప్పుడు మళ్ళా శాంతి భద్రతలు కాపాడటానికనే పేరుతో కాల్పులు వగైరా నిర్బంధ విధానం అవలంబించడానికి సిద్ధమవుతారు.

ఒకటే మార్గం

వ్యాసం మొదట్లోనే ఉదహరించినట్లుగా అధిక లాభాల దోపిడి ఫలితంగా రాబోయేవే వచ్చే కరువు దోపిడుల వలన ప్రజలకు మొత్తంమీద వచ్చే లాభంలేదు. పైగా రైతులు వగైరా ఉత్పత్తిచేసే బీద జనానికి నష్టమే. దరహంమీద షావుకార్లు లాభం పొందారనే సంగతి కూడా చూచాం. అందుచే కరువు దోపిడులను అరికట్టాలి. అందుకు ఒకటే మార్గం వుంది. ప్రజా సామాన్యానికి న్యాయమైన ఉచిత ఖరీదులకు జీవితావసరాలు అందజేస్తేనే అది సాధ్యమవుతుంది.

అందుకొరకు ప్రభుత్వం కంట్రోలు ధరలు నిర్ణయించాలి. వానిని అమలుజరపాలి. దోపిడి మార్కెటు(Black market)ను రద్దుచేయాలి. ఉదహరణకు కాగితాలఖరీదును నిర్ణయించుటతో పాటు దేశంలో వున్న కాగితం సరుకు స్టాక్ లెక్కలను సేకరించాలి. వర్తకులు కంట్రోలు ఖరీదుకు అమ్మనిచో స్టాక్ అంతా ప్రభుత్వమే స్వాధీనం చేసికొని ప్రభుత్వమే అమ్మించాలి. అపుడే కంట్రోలు ఖరీదులు అమలు జరుగుతాయి.

ముడి సరకులు

రైతులు వగైరా బీద జనులు ఉత్పత్తిచేసే ముడి సరుకుల కనీస ఖరీదులు నిర్ణయించబడాలి. లేనిచో యుద్ధ హడావుడిలో, బీద రైతులు తమ సరుకులు అమ్ముకోవలసిన రోజులలో, షావుకారుల దోపిడికి గురి అవుతారు. వారి సరుకులు స్వల్ప వెలకే అమ్ముకోవలసి వస్తుంది. అందుచే రైతులు అమ్మే ముడి సరుకులకు కనీస ఖరీదు నిర్ణయించబడితీరాలి.

ప్రభుత్వం దేశంలో వున్న వివిధ సరుకుల స్టాకును స్వాధీనపరచుకోవాలి. వర్తకులచే కంట్రోలు ఖరీదులకు అమ్మించాలి. నిర్ణయించబడిన ఖరీదులకు అమ్మని దుకాణదారులను కఠినంగా శిక్షించాలి. అట్టి వర్తకుల సరుకులను స్వాధీనం చేసికొని ప్రభుత్వమే షాపులు తెరచి కంట్రోలు ఖరీదులకు సరుకులను అమ్మాలి.

ఉదాహరణకు రైతుల వద్ద (కుసుమ, కొణామణీలు వగైరా) బస్తా 1కి కనీస ఖరీదు 7 రూ. నిర్ణయించాలి. బియ్యం ఖరీదు బస్తా 1కి రూ. 15 లేక 16 లు చొప్పున కంట్రోలు చెయ్యాలి. మినుములు వగైరా అపరాల కనీస ఖరీదు రూ 11 అని నిర్ణయించవచ్చును. కాగితాలకు యిప్పుడున్న కంట్రోలు ఖరీదు దస్తా 0-3-9. కఠినంగా అమలు జరిపించాలి. అదే విధంగా కిరోసిన్, పంచదార కంట్రోలు ఖరీదులు అమలు జరిపించాలి.

యుద్ధారంభంలో మన పంథా

యుద్ధారంభంలో కమ్యూనిష్టులం రైతులు పండించే ముడిసరకుల ఖరీదు కంట్రోలు చేయరాదని వాదించిన మాటనిజమే. అప్పటికి ధాన్యం వగైరా వ్యవసాయ సరకుల ఖరీదులు చెప్పదగినంతగా పెరుగలేదు. పైగా వేరుశనగ మాది వగైరా వర్తక సరకుల ఖరీదులు పడిపోయాయి. రైతులు కొనవలసిన పారిశ్రామిక వస్తువుల ఖరీదులు అప్పటికే పెరిగాయి. అందుచే అపుడు వ్యవసాయ సరకుల ఖరీదులు కంట్రోలు చేయరాదని నినాద మిచ్చాము. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అన్నిముడిసరుకుల ఖరీదులు తగినంతగా పెరిగాయి. జపాను దాడి ప్రమాదం వలన యుద్ధం భారత దేశానికి కూడా వచ్చినట్లే. ఈ సమయంలో వ్యవసాయ సరకుల కనీస ఖరీదులు నిర్ణయించ బడి ఒకే విధంగావుంచే బీదరైతులు రమధాన్యాన్ని శిస్తులు చెల్లించాలసిన సమయంలో షావుకారులకు స్వల్పఖరీదులకు అమ్మవలసిన గతి పట్టదు.

ప్రభుత్వ కర్తవ్యం

ఈ విధంగా ధరలను కంట్రోలు చేసి, అలా అమలు జరుపని వర్తకులనుండి సరుకును ప్రభుత్వం స్వాధీనం చేసి ప్రభుత్వ షాపులలోనే కంట్రోలు ఖరీదులకు అమ్మించాలి. అప్పుడు అధిక లాభాల దోపిడి సాగదు. దొంగ మార్కెటు (బ్లాక్ మార్కెటు) వ్యాపారము అరికట్టబడుతుంది. బీద ప్రజల అవసరాలు తీరుతాయి.

కూలి హెచ్చాలి

ఐతే యింతటితోనే ప్రభుత్వ కర్తవ్యం నెరవేరదు. యుద్ధం వచ్చాక వస్తువుల ఖరీదులో పెరుగుదల ననుసరించి కూలి పెరుగలేదు. అందుచే కార్మికుల కొనుగోలు శక్తి కుంటుబడింది. వారి జీతాలు, ముఖ్యముగా తక్కువ జీతం గలవారి కూలి, ధరల పెరుగుదల ననుసరించి పెంచవలెను. రవాణా సౌకర్యాలు లేక వస్తు సరఫరా తక్కువయితే రేషనింగ్ అమలుజరిపి, ప్రజలందరికీ బీదవారు, భాగ్యవంతుల తేడా లేకుండా, అందరికి కనీస పరిమాణంగల జీవిత అవసరాలు దొరుకునట్లు చేయాలి. లేనిచో ఆకలి మంటలు హెచ్చుతాయి. కరువు దోపిడులు వాటంతటవే ప్రారంభమవుతాయి. ఈ ప్రమాదం రాకుండా చేయడానికే రేషనింగు అమలు జరిపి ప్రజలందరికీ సమానంగా జీవితావసరాలు అందచేయవలెను.

రవాణా సౌకర్యాలు

వస్తువుల వుత్పత్తి చోటునుండి వినియోగించే ప్రదేశానికి రవాణా సౌకర్యాలు కలుగజేస్తే ప్రస్తుతం ఒకచోటికి, మరొకచోటికి ధరలలో వున్న విపరీతపు తేడా తొలగించవచ్చును. అదే విధంగా ప్రభుత్వోద్యోగులలో విపరీతంగా వున్న లంచగొండితనాన్ని రద్దు చేయాలి. ఇది సాగినంతకాలం ఎన్ని రూల్సు, శాసనాలు చేసినా అమలు జరుగవు. అధిక లాభాల దోపిడి సాగుతూనే వుంటుంది. పై విధంగా ధరల కంట్రోలు జేసి కరువు దోపిడుల ప్రమాదాన్ని తొలగించాలని ప్రజలందరు ఆందోళన చెయ్యాలి.

విజిలెన్సు కమిటీలు

అధిక ధరల వలన బాధపడుతున్న ప్రజలందరి నుండి "విజిలెన్సు కమిటీలను" ఎన్నుకొనాలి. అధికకంట్రోలు ఖరీదులకు మించి అమ్ముతున్న షావుకారులపై ప్రభుత్వోద్యోగులకు రిపోర్టు చేయవలెను. ప్రజలందరిచే సంతకాలు చేయించి ప్రభుత్వానికి పిటీషన్లు పెట్టించాలి. ఈ విధంగా ప్రజాసమీకరణ జరిపినాక, అధిక లాభాల దోపిడికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రదర్శనాలు జరపాలి. ఈ విధమైన ప్రజాఒత్తిడి ద్వారా ప్రభుత్వం చేతనే కంట్రోలు ఖరీదులకు అమ్మే దుకాణాలను పెట్టించాలి.

ముగింపు

కండ్లుమూసుకొన్న ఉద్యోగులను మేల్కొలిపి, రానున్న ప్రమాదాన్ని గుర్తించునట్లు చేయాలి; ఉద్యోగులు వెంటనే అధిక ధరల కమ్మే దుకాణాలను స్వాధీనం చేసికొని, కంట్రోలు ఖరీదులకు అమ్మించు వరకు వదలరాదు.

జపాను ప్రమాదం మనదేశాన్నిఎదుర్కొంటున్న ఈ సమయంలో ప్రభుత్వం పైవిధంగా ప్రజలకు జీవితావసరాలు అందునట్లు చేసితీరాలి. లేనిచో కరువు దోపిడులు ప్రబలి అరాచక పరిస్థితులు వస్తాయి. జపాను దుండగీడుల పని సులభ మవుతుంది. ప్రజల అసంతృప్తిని తీర్చక,నిర్బంధ విధానంద్వారాప్రజా యుద్ధాన్ని జయించడం సాధ్యం కాదనే సంగతి ప్రభుత్వం గుర్తించాలని హెచ్చరించుచున్నాము.

(7 వ పేజీ తరువాయి)

(2) యుద్ధ ఎలవెన్సు 1-1-1942 నుంచి 13-8-0 చొప్పున 'బి' ఏరియాలోను, 15-0-0 చొప్పున 'ఎ' ఏరియాలోను, రు 250 అంతకు తక్కువ జీతం పొందే కార్మికులకు ఈయాలి.

(3) రావు కమిటీ సూచించినట్లుగా, ప్రభుత్వ ఖర్చులతో, యం. యస్. యం. రైల్వే అంతటాచౌకడిపోలు పెట్టించాలి.

(4) అధిక లాభాలను అరికట్టుతూ, కంట్రోలు పెట్టాలి.

(5) బీద రైతులకు భూమిలేని రైతులకు, కూలీలకు బంజరుభూములిచ్చి ఆహారపదార్థాలను ఎక్కువ జేయాలి.

ఈ సమస్యపై అ. భా. ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, రైల్వేమెన్సు ఫెడరేషను దేశవ్యాపిత ఆందోళన చేయాలిని ఈ సభవారు కోరుచున్నారు.

ఏజెంట్లకు

ఎక్కువ కాపీలు కావలసినా, తగ్గించవలసి వచ్చినా శనివారం నాటికి ఆఫీసుకు తెలియజేయాలి. లేనిచో మార్పుచేయబడదు. —మేనేజరు

సోవియట్ రష్యాలో స్త్రీలు

రచన: పి. పిచుగీనా,
మెంబర్ ఆఫ్ ది సుప్రీమ్ సోవియట్ ఆఫ్ ది యు. యస్. యస్. ఆర్.

అనువాదం
యస్. వి. యస్. ప్రసాదరావు

జారు చక్రవర్తుల ప్రభుత్వకాలంలో రష్యాలో స్త్రీలకు హక్కులనేవి లేవు. స్త్రీ అన్నివిధాల బాధింపబడేది. ప్రభుత్వోద్యోగములలో ఆమెకు స్థానముండేది గాదు. అనాటి వివాహములకు సంబంధించిన ప్రభుత్వ శాసనములు స్త్రీలకు సౌకర్యములను కల్గించకపోవుటయే గాక ఆమెనొక బానిసగా పరిగణించి, ఒక భోగ యంత్రముగా భావించి పాలించేవి. పురుషులలో కంటె స్త్రీలలో అవిద్య హెచ్చుగా ఉండేది.

శ్రామిక కుటుంబములకు చెందిన స్త్రీలు ఆనంద మనునది ఎరుగరు. అట్టి స్త్రీలు బండచాకిరి చేసినను పురుషుని కంటె తక్కువ కూలి ఇచ్చేవారు. కాని పురుషునివలె రోజుకు పని మొదలు పంద్రెండు గంటల వరకు పనిచేయవలసిందే. స్త్రీలు తీరని ఆకలితోనూ, అజ్ఞానముతోను, తీరని కోర్కెలతోను, అసంతృప్తితోను జీవించేవారు. మధ్య మధ్య ఏర్పడు నిరుద్యోగము వలననూ, తదితర కారణముల వలనను శ్రామిక కుటుంబములు విచ్ఛిన్నములగుచుండేవి.

కర్షక వనితల స్థితికూడ ఏమాత్రము శ్రామిక కుటుంబములలోని స్త్రీలకంటె మేలుగలేదు.

అసంఖ్యాకములైన చిన్న చిన్న జాతులలోని స్త్రీల పరిస్థితి ఇంకను బాధాకరముగా నుండేది. జారుల కాలంలో రష్యాలో తూర్పు భాగంలో నివసించే స్త్రీలకు మానవసహజమైన హక్కులు కూడా ఉండేవి కావు. ఆ ప్రాంతముల లోని స్త్రీలు, తమ ముఖములకు పరంజా లనెడి బురఖాలను తగిలించుకుని సూర్యరశ్మికూడ కరవై అంధకారములో జీవించేవారు. పురుషులతోపాటు సహపంక్తిని కూర్చుని భోజనము చేయుటకు స్త్రీలకు హక్కులేదు. ఆడ శిశువు పుట్టుకను ఒక దురదృష్టముగా భావించేవారు. ఎక్కువమంది స్త్రీ శిశువులు జనించిన కుటుంబమును గౌరవ హీనముగ జూచేవారు.

1917 ఫిబ్రవరిలో జారుచక్రవర్తులను హతమార్చి, 1917 అక్టోబరులో బ్రహ్మాండమైన విప్లవాన్ని తీసుకువచ్చిన తర్వాత, ఆ అక్టోబరు విప్లవ ఫలితంగా స్త్రీలు తమ బానిసత్వములోనుండి విముక్తి చెందారు. పురుషులతోబాటు స్త్రీలు సమాన హక్కులను పొందారు.

సోవియట్‌రష్యా ప్రభుత్వ విధానము 122 సూత్రము ననుసరించి, స్త్రీలకు, ఆర్థిక, ప్రభుత్వ, వైజ్ఞానిక, సాంఘిక, రాజకీయ రంగములలో పురుషులతోబాటు సమానహక్కులు ఇవ్వబడినాయి.

పై హక్కులను అనుభవించుటకు స్త్రీలకు అవకాశములు కలుగ చేయబడినాయి. పురుషులతోబాటు స్త్రీలకు పని చేసే హక్కు నిచ్చారు. పురుషులతో సమానముగా కూలి నేర్పాటు చేశారు. పురుషులతో సమానముగ సంవత్సరము లోని కొంత భాగమును విలాసముగాను, విశ్రాంతిగాను, గడుపుటకు ఏర్పాట్లు చేశారు. స్త్రీలు ప్రసవించినపుడు, ప్రసవ కాలమునకు ముందు, తర్వాత కూడా సెలవును పూర్తిజీతముతో నెలకొల్పారు. ప్రసూతి వైద్యశాలలను, శిశురక్షణ గృహములను ప్రభుత్వం విరివిగా స్థాపించింది.

సోవియట్ ప్రభుత్వవిధానము 137 సూత్రము ననుసరించి స్త్రీలు తమ ప్రతినిధులను ఎన్నుకొనుటకు, ఎన్నుకోబడుటకు పురుషులతోబాటు సమానహక్కును పొందారు.

సోవియట్‌రష్యా ప్రభుత్వ విధానములో స్త్రీలకున్న హక్కులను అనుభవించుటకు స్త్రీలకు సంపూర్ణావకాశాలున్నాయి. నేడు సోవియట్ జాతీయ ఆర్థిక విధానములలోని శాఖోపశాఖలలోనూ స్త్రీలువిరివిగా పనిచేయుచున్నారు. ప్రథమ ద్వితీయ పంచవర్ష ప్రణాళికల (1928-37) సమయంలోనూ ఉద్యోగములలోనున్న స్త్రీల సంఖ్య 3,000,000 నుండి 9,000,000 వరకు పెరిగింది. అంతేగాక స్త్రీలు చేసే పనియొక్క స్వభావంకూడా మారింది.

జారులనాటి రష్యాలో 1897 లెఖల ప్రకారం పనిచేయుచున్న స్త్రీలలో నూటికి 55 మంది పెద్ద పెద్ద భూస్వాములు, పెట్టుబడిదారులు, భాగ్యవంతులైన ప్రభుత్వోద్యోగుల ఇండ్లలో పరిచారికలుగా పనిచేసేవారు. నూటికి 25 మంది పొలములలో పనిచేసేవారు, నూటికి నలుగురు విద్య, ఆరోగ్య శాఖలలో పనిచేసేవారు, నూటికి 13 మంది పారిశ్రామిక,వ్యాపారసంస్థలలో పనిచేసేవారు.

1936 సం॥ నాటికి నూటికి 39 మంది స్త్రీలు పెద్ద పెద్ద పారిశ్రామిక కేంద్రములలోనూ, నూటికి 15 మంది షాపులలోనూ, సరఫరా శాఖలలోనూ, ప్రభుత్వ భోజన శాలలలోనూ, పనిచేస్తున్నారు. నూటికి 20 మంది లేడీ డాక్టర్లుగానూ, ఉపాధ్యాయినులుగను పనిచేస్తున్నారు. నూటికి ఇదరు మాత్రమే సామాన్యపనులు చేయుచున్నారు. మిగతా నూటికి 24 మంది పరిశ్రమలలోనూ, శాస్త్రవిషయములలోనూ, కళాకేంద్రములలోనూ, పనిచేస్తున్నారు.

సోవియట్ రష్యాలో పెద్ద పారిశ్రామిక కేంద్రములున్నవి. లెనిన్‌గ్రాడ్ లోని "షారోకోడ్" చెప్పులమిల్లులో పనిచేసే శ్రామికులలో నూటికి 60 మంది స్త్రీలే. ప్రజాసామాన్యములోను సోవియట్‌రష్యా ఉత్పత్తిలోను స్త్రీ ప్రముఖ పాత్ర వహించుటకుగాను సోవియట్ ప్రభుత్వం, శిశుపోషణ శాలలను, నర్సరీలను విరివిగా స్థాపించింది. తల్లులు పని చేయు కాలమందు, శిశువులను ఈ శిశురక్షణ శాలలో వప్పగించి వెళ్ళవచ్చు.

1937 సం॥లో సోవియట్ రష్యాలో 1,800,000 శిశువులకు సరిపోయే శిశురక్షణశాలలు, చికిత్సాలయాలు నిర్మించబడినాయి. మూడవ పంచవర్ష ప్రణాళిక ననుసరించి, 1942 నాటికి 4,200,000 శిశువులకుసరిపోయేరక్షణశాలలు నిర్మించబడతాయని అంచనా వేశారు. సంవత్సరంలో కొన్ని మాసములకు మాత్రమే ఉపయోగించే శిశురక్షణ శాలలను సమిష్టి వ్యవసాయ క్షేత్రముల వారు నిర్మించారు. అలాంటివాటిలో 1937 నాటికి షుమారు 5,700,000 మంది శిశువులకు వసతి ఏర్పడింది. ఇట్టివి పంటల సమయంలో మాత్రమే ఏర్పాటు చేయబడతాయి.

ప్రజలు సమిష్టి భోజన శాలలను ఏర్పాటు చేసుకొనుటవలన స్త్రీలకు పంట బాధ్యత తగ్గింది. సోవియట్ రష్యాలో షుమారు 30,000 సమిష్టి భోజన శాలలు ఉన్నాయి. 1938 సం॥లో ఈ భోజన శాలల రాబడి12,000,000,000రూబుల్సు 1939 సం॥రములో 13,500,000,000 రూబుల్సు ఉంటుందని అంచనా వేశారు.

సోవియట్ రష్యాలో, స్త్రీ ఇతర శ్రామికులవలె రోజుకు 7 గంటలు పని చేస్తుంది. చాల శాఖలలో 6 గంటలు మాత్రమే పనిచేస్తుంది. పురుషులతోబాటు చేసిన పనికి సమానంగా డబ్బు తీసుకుంటుంది. పురుషునివలె స్త్రీ కూడా సంవత్సరాంతపు సెలవును పూర్తి జీతముతో పొందుతుంది. ఆరోగ్యము సరిగా లేనియెడల చికిత్సాలయాలలోనూ, విశ్రాంతి భవనములలోను పూర్తిజీతాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని పొందుతుంది.

స్త్రీలకు, నేర్పరితనాన్ని సంపాదించినందుకు, పని సరిగా చేసినందుకు సోవియట్ ప్రభుత్వం సన్మానాలు జరుపుతుంది. తరతరములనుండి, పురుషులే చేయగలవనుకున్న పనులన్నియు నేడు సోవియట్ రష్యాలో స్త్రీలు చేయగలుగుతున్నారు.

విప్లవానికి పూర్వం స్త్రీలు రైలు రోడ్లపై ఏవిధమైన బాధ్యతగల ఉద్యోగములలో నుండుటకు వీలులేదు. నేడు షుమారు 5 లక్షల మంది స్త్రీలు. అట్టి స్త్రీలలో 400 మంది స్టేషన్ మాష్టర్లుగా నున్నారు. 1400 మంది అసిస్టెంటు స్టేషన్ మాష్టర్ పదవులలో నున్నారు. షుమారు 10,000మంది స్త్రీలు ఇంజనీర్లుగాను యంత్రాలను మరమ్మతు చేసేపనుల లోనూ ఉన్నారు. ఏమి ఈ వింతమార్పు!

ఏ స్త్రీయైనను, పరిశ్రమలలో పని చేయు స్త్రీగాని, సమిష్టి వ్యసాయ క్షేత్రములకు సంబంధించిన స్త్రీగాని శక్తి సామర్థ్యములు గల స్త్రీయని ఋజువు చేసుకునే పక్షంలో ఉన్నతదశకు పోవడానికి అన్ని అవకాశములూ వున్నాయి.

సోవియట్ రష్యాలో, స్త్రీ ఇంజనీర్లు, లేడీ డాక్టర్లు, స్త్రీ వైమానికులు, శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలూ ఉన్నారు. ప్రభుత్వపు వివిధ శాఖలలోనూ స్త్రీ పని చేయనిశాఖ లేనేలేదు. సోవియట్ రష్యాలో 100,000 మందికిపైగా స్త్రీ ఇంజనీర్లున్నారు. వీరు పారిశ్రామిక కేంద్రములలో పని చేస్తుంటారు. ఇతర దేశాలన్నిటిలోనూ కలిపి చూస్తే 10,000కు పైగా లేరు స్త్రీ ఇంజనీర్లు.

జారులకాలంలో రష్యాలో 2,000 మంది లేడీడాక్టర్లుండేవారు. నేడు సోవియట్ రష్యాలో 132,000 మంది డాక్టర్లున్నారు. ఇందులో సగంమంది లేడీ డాక్టర్లే.

నేడు షుమారు 19,000,000 మంది స్త్రీలు సమిష్టివ్యవసాయ క్షేత్రములలో గాని ప్రభుత్వవ్యవసాయ కేంద్రములలో గాని పనిచేస్తున్నారు. మాక్సిమ్‌గోర్కీ మహాశయుడు వర్ణించినట్లు మూగపనిముట్లు (Dumb tools) గా వాడబడే స్త్రీలు సోవియట్ రష్యాలో మరిలేరు. నేడు అచటి స్త్రీ బానిసకాదు. బంధింపబడిలేదు. బానిసత్వముతో నుండి విముక్తి చెంది స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తోంది.

సమిష్టి వ్యవసాయ క్షేత్రములు స్థాపించబడుట ద్వారా స్త్రీ పూర్తిగా విముక్తి చెందింది.

విప్లవానికి పూర్వం కర్షక వనిత సూర్యోదయము దగ్గఱనుండి, సూర్యాస్తమయం వరకు పనిచేసినప్పటికి, తన సంపాదన తనకు తెలియదు. కాని నేడు సోవియట్ రష్యాలో సమిష్టి వ్యవసాయ క్షేత్రములలో పని చేసే ప్రతి స్త్రీ తాను తనకుటుంబంకోసం ఎంతసంపాదిస్తోందీ చెప్పగలదు. 1936 నాటి లెఖలప్రకారం స్త్రీ వ్యవసాయదారులు చేసిన మొత్తం పని అసలు పనిలో 35% వర్కుడేయూనిట్లని తేలినది.

ఇదివరలో స్త్రీలు సున్నితమైన పనులు చేయగలరని నమ్మేవారు. కాని నేడు సోవియటు రష్యాలో 1,500,000 మంది ట్రాక్టర్ డ్రైవర్లు, కంబైన్లు నడిపేవారు ఉన్నారు. ఇందులో పురుషుల సంఖ్యకు స్త్రీలేమాత్రము తీసిపోవడంలేదు.

(1 వ పేజీ తరువాయి)

ఇంగ్లండ్‌లో "డెయిలీ హెరల్డు" పత్రిక సంప్రతింపులు తిరిగి ప్రారంభించాలంటూ యీ విధంగా వ్రాసింది. "బ్రిటిషు ప్రజలను భారతీయులనుంచి దూరంగా వేరుచేయబడడానికి కారణభూతమైన సమస్యలు తక్షణమే ఐక్యతతో పరిష్కరించబడాలని బ్రిటిషు ప్రజలు కోరుతున్నారు

"న్యూ స్టేట్సుమన్ అండ్ నేషన్" పత్రిక భారతదేశ స్వాతంత్ర్యానికి మిత్ర రాజ్యాలన్నీ కలసి గ్యారంటీ చేయాలనీ, ఇండియాలో యేమి జరిగినా భారతీయులకే కాకుండా మన దేశ ప్రజలకు కూడా సంబంధించి యుంటుందనీ వ్రాసింది.

విజ్ఞప్తి

కాబట్టి బొంబాయిలో సమావేశం అవుతున్న అ.భా.కాం, కమిటీకి మావిజ్ఞప్తి యేమంటే;

శాసనోల్లంఘన తీర్మానం ఆమోదించక, వెంటనే కాంగ్రెస్ — ముస్లింలీగ్ ఐక్యతకై వర్కింగు కమిటీ కృషి చేయవలసిందిగా తీర్మానించాలి.

అయినప్పటికీ అ. భా. కాం. కమిటీ తీర్మానం అమోదించబడి, శాసనోల్లంఘనం ప్రారంభమయితే, కమ్యూనిష్టులు కాంగ్రెసునుండి విడిపోరు. అట్టి ఉద్యమం మన దేశానికి యెంత హానికరమో కాంగ్రెసు వాదులలో ప్రచారం చేస్తారు.

అభేద్యమైన కోట! రంగపూర్!!

అస్సామ్ రాష్ట్రి సరిహద్దుకు ఆనుకొనే రంగపూర్ జిల్లావుంది. ఈ జిల్లాలో రైతులు పొడుగాంటి విల్లులు తయారుచేసి, గురి నేర్చుకొంటున్నారు. అలా ప్రాక్టీసు చేసేటప్పుడు ఒక బాణంతో ఒక జపానువాణ్ణి హతమార్చితీరాలి అనే నినాదాన్ని ఆకర్షకనీరులు తమ ఆదర్శంగా ఎంచుతున్నారు. జిల్లాలో యింకో వైపున రైతులు తాతలనాటి కత్తులు, కఠారులు పైకి తీసి. తుప్పు తుడిచివేసి పదును పెడుతున్నారు.

రంగపూర్ రైతులు నిస్సహాయులుగా ఉండదలచలేదు. రైఫిల్సు. తుపాకులు లేకపోతే యేమి! విల్లు, అంబులతోను కత్తులతోను ప్రాక్టీసు ప్రారంభించారు. కత్తులుకూడా లేనపుడు "మా యువకులు మంచి ఎదురుపొదల నరికి లాటీలను తయారుచేస్తున్నారు," అని అంటున్నారు రైతులు. ఇదంతా ఏమితెలియజేస్తుంది? రంగపూర్ రైతులు జపాన్ ఫాసిస్టు దుండగీడులను హతమార్చడానికి సిద్ధమవుతున్నారన్నమాట. అందుకొరకు వారు స్వశక్తిపైనే ఆధారపడుతున్నారు. చొరవజేసి తమంతటతామే సన్నాహాలు చేసికొంటున్నారు. వారికున్న బలమంతటితో స్వల్ప ఆయుధాలతోనే శత్రువు నుండి తమ మాతృభూమిని రక్షించుకోడానికి కృతనిశ్చయులయ్యారు.

ఈకర్తవ్యాన్ని తెలిసికోడంలో రైతుస్త్రీలు, పురుషులకు ఏమాత్రం తీసిపోలేదు. 'హుల్-గాబ్' గ్రామ మహిళామణులు ప్రత్యేకంగా ఒక స్త్రీ వాలంటీరు దళాన్ని ఆర్గనైజు చేసికొన్నారు. "బాదర్ గంజ్" గ్రామంలోకూడ ఒక మహిళా వాలంటీరు దళాన్ని ఆర్గనైజు చేసికొన్నారు. ఈదళం చుట్టూవున్న గ్రామాలకు, పట్టణానికి వెళ్ళి జపాను దురాక్రమణవస్తే స్త్రీలు ఎలా పనిచేయాలో వివరించుతూ ప్రచారం చేస్తూంది!

జిల్లా యందంతటా గ్రామాలన్నిటిలోనూ వాలంటీరు దళాలు ఆర్గనైజు చేయబడ్డాయి. దానిలో రైతులు, మధ్య తరగతి ప్రజలుకూడ కలసి పనిజేస్తున్నారు. ప్రతి గ్రామములోను బెంగాల్ కమ్యూనిష్టుల పత్రికయగు "జనయుద్ధ" లోని నినాదాలను యిస్తూ వాలంటీరు దళాలు కవాతు చేస్తుంటాయి. ప్రజలందరికి యీ నినాదాలు పరిపాటి అయిపోతున్నాయి.

ఇంకో గొప్ప విషయమేమిటంటే చాలా గ్రామాలలో హిందూ-ముస్లిముల మధ్య అన్యోన్యత పెంపొందుతూంది. ఒకే కమిటీలలో కలసి పనిజేస్తూ వారు వాలంటీరులను జేర్పిస్తున్నారు. కిసాన్ సభకు చెందినవారైనా లేక ముస్లిమ్‌లీగ్ వారైనా సరే అంతా జపాన్ దుండగీడులను ఐక్యతతో ఎదిరించడానికి కృతనిశ్చయులై వున్నారు.

ఇంకా కొన్ని గ్రామాలున్నాయి. ఆ గ్రామాలకు మన కామ్రేడ్సు ఎన్నడు వెళ్ళివుండలేదు. అయినప్పటికీ అచట కూడా ప్రజలు తమంతట తామే తమకు రానున్న ప్రమాదాన్ని తెలిసికొని, దురాక్రమణ దారులను ప్రతిఘటించడానికి సన్నాహాలు చేస్తున్నారు. రోజు రోజుకు ప్రజలలో ఉత్సాహం యినుమడించుతూంది. శాంతిదినాలలో నెలల తరబడి కూడ జరుగని పని యిపుడు యుద్ధపరిస్థితులవల్ల కొలదిరోజులలోనే చేసివేయడం ప్రజలు నేర్చుకొంటున్నారు. కాని రంగపూర్ జిల్లాలో ప్రజలు అత్యుత్సాహంతో జరుపుతున్న ఈపని దానంతటదే ప్రారంభమవలేదు. దాని వెనుక కొంత చరిత్రవుంది.

సంపూర్ణ ఐక్యత

రంగపూర్ పట్టణం చూపిన మార్గం బెంగాల్ రాష్ట్రిమంతా అనుసరించతగినది. అచట జాతీయ ప్రతిఘటన జరుపడానికి సంపూర్ణ ఐక్యత సాధించబడింది. పట్టణ ప్రజలందరు, అన్ని సంస్థలు, పార్టీలు ఒకే ప్రజారక్షణ సంఘంలో జేరాయి. కమ్యూనిస్టులు, కాంగ్రెసు, కిసాన్‌సభ, ముస్లిమ్‌లీగ్ తదితరసంస్థలు పీపిల్సు డిఫెన్సు కమిటీలో వున్నాయి. ప్రభుత్వోద్యోగులు కూడ యీ కమిటీని గుర్తించవలసి వచ్చింది. ఆచరణలో ఐక్యతద్వారా ప్రజలలో ఎంత ఉత్సాహాన్ని కలిగించవచ్చునో చూపడానికి ఇది చక్కని ఉదాహరణ.

ప్రజారక్షణ సంఘమే పట్టణంలో ప్రజా జీవితాన్నంతటిని నాయకత్వం వహించి నడుపుతూంది. ఈ సంఘతీర్మానాలను పౌరులు తూ చా తప్పకుండా అనుసరించు తున్నారు. అందుచేతనే నిరంకుశోద్యోగులు తమకు యిష్టం లేకపోయినా ప్రజారక్షణ సంఘంతో సహకారం చేయక తప్పటలేదు. వివిధ పేటలలో వాలంటీరు దళాలు నిత్యమూ కవాతు చేస్తూవుంటాయి. రంగపూర్ చుట్టుపట్ల వుండే గ్రామాలలో వైవాలంటీరుదళాలకథలు వ్యాపించాయి. రైతులు "పట్టణంలో గోరిల్లా దళాలు కవాతు చేస్తూ ప్రజా యుద్ధనినాదాలు యిస్తున్నాయి." అంటూ చెప్పుకోసాగారు. ప్రజారక్షణసంఘం బాధ్యత వహించి, తీవ్రంగా పనిజేసే కొలదీ ప్రభుత్వోద్యోగుల వ్యతిరేకత, విముఖత తగ్గిపోయింది. క్రమంగా ప్రజలనాయకత్వం యీ సంఘంలో కేంద్రీకృతమయిపోతుందనీ, జిలాలోని గ్రామాలలో ప్రజా ఉత్సాహం చెలరేగుతుందనీ, మాకు నమ్మకముంది.

స్వాతంత్ర్యం కొరకు

పట్టణంలోనేగాక అనేక గ్రామాలలో కూడ కమ్యూనిస్టులం, క్రమపద్ధతిని వాలంటీరు దళాలను నిర్మించాము. సింగిమారి - కాంతల్‌బారి గ్రామంలో 8 వందల వాలంటీర్లు లాఠీలను ధరించి డ్రిల్లు చేస్తుంటారు. వారిని చూచి గ్రామస్థులు సగర్వంగా చెప్పుకొంటారు. ఆ వాలంటీర్లు కవాతు చేస్తుంటే పవిత్రధర్మం నెరవేర్చడానికి పోతున్న యోధులవలె కన్పించుతున్నారు. కెప్టెన్ ఆజ్ఞ యివ్వగానే తమ తమ స్థానాల్లో వాలంటీర్లు నిలబడుతారు. వారిలో "పోరాడుదాం! స్వాతంత్ర్యం సంపాదించుదాం" అనే బెంగాల్ రైతుల పట్టుదల మూర్తీభవించి వుంది.

ఖేలబారి గ్రామంలో 500 హిందూ - ముస్లిమ్ రైతులు సమావేశమయి జపాను దుండగీడులను ప్రతిఘటించి తీరుతామని మాతృభూమిని రక్షించు కొంటామని శపథం చేసారు.

ఆ జిల్లా అంతా జపాన్ దురాక్రమణ దారులను ఎదిరించడానికి సిద్ధంగా వున్న ప్రజలకోట "ఐక్యతతో జపాన్ దుండగీడులను హతమార్చుదాం. బెంగాల్ సువర్ణ భూమి మనది: మనమే దానిని రక్షించు కొందాం! రైతులం, కూలీలం మనమే రక్షించుకుందాం! అనే నినాదాలతో వాతావరణమంతా నిండివుంది.

రంగపూర్‌ను అనుసరించండి!

రంగపూర్ ఒక బెంగాల్‌కే గాక భారత దేశానికంతటికీ చక్కని ఉదాహరణ. రంగపూర్‌లో విద్యార్థులు, రైతులు, మధ్య తరగతి వేయేల ప్రజలంతా జపాను దుండగీడులను ఎదిరించడానికి ఐక్యతతో ముందంజ వేస్తున్నారు. దీనినంతా నడిపే దెవరు? రైతుల గుడిశెలలోవున్న బీదరైతు కామ్రేడ్స్, విప్లవకారులు, స్థానిక కామ్రేడ్స్ యిదంతా సంఘటిత పరుస్తున్నారు. ఈదేశభక్తులు అలసట ఎరుగకుండా మన సువర్ణ భూమిని రక్షించ డానికి, తద్వారా మాతృదేశ స్వాతంత్ర్యాన్ని స్థాపించడానికి కృషి చేస్తున్నారు.

కమ్యూనిష్టుల కర్తవ్యం

పార్టీపై నిషేధం తొలగించబడిన తర్వాత మనం ఏమి చెయ్యాలి?

అఖిల భారత కమ్యూనిష్టు పార్టీ కార్యదర్శి పి. సి. జోషీ యీ క్రింది ప్రకటన గావిస్తున్నారు:—

భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించడం కమ్యూనిస్టుల ప్రత్యేక విజయంకాదు. భారతీయు లందరు సాధించిన విజయం. ప్రజాతంత్ర హక్కుల కొరకు, పౌరసత్వపుహక్కుల కొరకు ప్రజలచే సాగించబడే పోరాటానికి యిది విజయం.

1934 వ సం॥రంలో భారత కమ్యూనిస్టు పార్టీని, అనేక కార్మికసంస్థలను, నిషేధించడం ఒకే సారి జరిగెనను విషయాన్ని మనం మరచి పోగూడదు. ఆటుతరువాత, ఎన్నికలలో కాంగ్రెసు గెలుపొంది, కాంగ్రెసు మంత్రులే అధికారానికి వచ్చిన మీదట, ఆ యితరసంస్థలపై గల నిషేధాలు తొలగించబడ్డాయి. కమ్యూనిస్టుపార్టీపై నిషేధం మాత్రము అలాగేఉండిపోయింది. కారణం, అదికేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన శాఖ: కాంగ్రెసు మంత్రులకు ఆ శాఖపై అధికారం లేదు. 1938 లోను, 1939 లోను, కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించాలి అనే ఆందోళనను కాంగ్రెసు, కార్మిక సంఘాలు, రైతుసంఘాలు, బలపరిచాయను సంగతి కూడా మనం జ్ఞాపకం తెచ్చుకోవాలి. కాబట్టినేడు నిషేధాన్ని ఆలస్యంగా తొలగించినప్పటికీ, చాలాకాలం ప్రజలచే జరుపబడిన పోరాటఫలితమే యిది. ఈ విజయాన్ని దేశంలో ఉన్నపార్టీలన్నీ అహ్లాదంతో ఆహ్వానించక మానవు.

సంయుక్త జాతీయ సంఘటన

ఇన్ని సంవత్సరాల నుంచీ కమ్యూనిస్టుపార్టీ పట్టుదలగా ఏ దగ్గర గమ్యస్థానం (Immediate aim) కొరకు పాటు పడుతూ వచ్చిందో, ఆసామ్రాజ్యవాదాన్ని నాశనంగావించడానికి, దేశంయొక్క సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి, దేశం లో ప్రజాతంత్రరాజ్యాన్ని స్థాపించ డానికి, కావలసిన సంయుక్తజాతీయసంఘటన (National united front) కై పాటుపడుతూ వచ్చింది. ప్రజాతంత్రరాజ్యం అంటే, రైతులకు చాలినంత భూమి, కార్మికులకు న్యాయమైన జీవనభృతి, ప్రజలెవరూ అణచబడకుండా స్వేచ్ఛతోను సమానప్రతిపత్తితోను బ్రతికేహక్కు-ఇవి గ్యారంటీ చేసే రాజ్యం. దేశాన్ని ప్రమాదం ఆవరించియున్న యీ సమయంలో కమ్యూనిస్టు పార్టీ తన యావచ్ఛక్తినీ వినియోగించడానికి అవకాశం లభించడం మంచి విషయమే కాదా! ఎందువల్లనంటే, దేశాన్నంతటినీ ఐక్యపరచడానికి, ఖ్యాతిగాంచిన మన జాతీయ సంస్థలను ముఖ్యంగా కాంగ్రెసును, ముస్లింలీగును, దగ్గరగాతీసుకు రావడానికి, మా యావచ్ఛక్తినీ వినియోగించవలెనని నిశ్చయించుకున్నాం. మిత్రరాజ్యాల సహకారంతో ఫాసిస్టు పెనుభూతాల నుంచి మన మాతృ భూమిని రక్షించుకొనే నిమిత్తం ప్రజలందరినీ సంఘటితపరచి, స్వేచ్ఛా ప్రపంచంలో భారత దేశపు స్వేచ్ఛను స్థాపించడానికి జాతీయ ప్రజా ప్రభుత్వం అవసరం కాబట్టి దాన్నిసాధించడానికి జాతీమైకృతవిధిగాఉండాలి కాబట్టి, పైజెప్పినకాంగ్రెసు ముస్లింలీగు ఐక్యతకై మేము కృషిచేస్తాం.

బహిరంగంగా పనిచేసే కమ్యూనిస్టుపార్టీ దేశంలోని కార్మిక కర్షక బాహుళ్యం నుంచి తన బలాన్ని సంపాదించు కొంటూ, జాతీయోద్యమానికి ముఖ్యంగా నేటి ప్రమాద పరిస్థితులలో, ఎంతో బలాన్ని యివ్వగల్గుతుంది. జాతీమైక్యతను నెలకొల్పడానికి మన దేశాన్ని సంరక్షించు కొంటూ సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించు కోడానికి ఒకే మార్గం ఆయిన జాతీయ ప్రతిఘటనను సాధించ డానికి, మేము ముందు నిలబడి ప్రాణాలు సమర్పిస్తాం. భారత కమ్యూనిస్టులమైన మేము మా సోదర పార్టీ అయిన చైనా కమ్యూనిస్టుపార్టీ అవలంబించే దివ్య మార్గాన్ని అవలంబించాలని మా ఆశ.

విజ్ఞప్తి

పార్టీయందలి ప్రతి సభ్యునికి, ప్రతి పార్టీ సానుభూతి పరునికి నా విజ్ఞప్తి ఏమిటంటే, మిమ్మల్ని నేడు ఎదుర్కొనే బాధ్యత ఎంత ఎక్కువో బాగా గుర్తించండి. లెనిన్ - స్టాలిన్‌ల పార్టీలో సభ్యులు ఎలా ప్రవర్తించాలో అలాగు మీ బాధ్యతను మీరు నెరవేర్చడానికి బద్ధ కంకణులు కండు! బ్రహ్మాండమైన మన జాతీయోద్యమానికి ఖ్యాతిని తెప్పించే రీతిని మీరు ప్రవర్తించ వలసి ఉంది. మననాయకుల్ని మనం ఇంకా బయటికి విడిపించుకోవాలి. జాతీయ శక్తులన్నింటినీ మనం యింకా ఐక్యపరచ వలసియుంది. దేశ రక్షణకు, ప్రజలందరినీ యింకా మేల్కొలిపి, సంఘటిత పరచవలసి ఉంది. ఈ స్వాతంత్ర్య మహా సంగ్రామంలో మన భారత దేశంకూడా ప్రజాశక్తులన్నిటి తోబాటు సరియైన స్థానాన్ని అలంకరించేటట్లు చేయవలసి ఉంది. మన పార్టీ నాయకత్వాన దాని శిక్షణ క్రింద మనం యీ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ముందుకు సాగి పోదాం. విజయం తప్పక మనకు లభిస్తుంది.

యం. యస్. యం. రైల్వేపనివారలసంఘం

గుంతకల్

గుంతకల్ బ్రాంచి యాజమాన్యమున 20-7-42న బహిరంగ సభ జరిగెను. లోకోషెడ్ కార్మికులు ఊరేగింపుతో వచ్చిరి.

ఈ క్రింది తీర్మానములు ఆమోదింపబడెను.

తీర్మానం :—(1) షేకు సాబు అనే యింజను క్లీనరు మేస్త్రీని ప్రమోషను విషయంలో అన్యాయంచేసి, ధనకొండ ట్రాన్సుఫర్‌చేశారు. తన యిబ్బందులను చెపుతూ 6 నెలల సైముగాని, ఒక నెల అడ్వాన్సు జీతముగాని యిచ్చినచోట్రాన్సుఫర్ మీద వెళ్ళుటకు సిద్ధముగా నున్నానని, అతడు అపీలుచేసుకున్నాడు. ట్రాన్సుఫర్ అన్యాయమని 250 మంది కార్మికులు సంతకముచేసి తమ అసమ్మతిని ప్రకటించారు. అయినా డి. టి. యస్. పి. ని లక్ష్యపెట్టక తన ఆర్డర్లు కారీఔట్ (Carry Out) చేయలేదని సస్పెండులో పెట్టాడు. తనకు న్యాయం జరపాలని పై అధికారిఅగు సి. వొ. పి. యస్. కు అపీలు పెట్టుకున్నా దానికి దాదాపు రెండు మాసాలు కాలయాపన చేసి, డి. టి. యస్. పి. చర్యలను సమర్థిస్తూ జవాబు యిచ్చిన సి. వొ. పి. యస్. చర్యలను యీ సభవారు తీవ్రముగా నిరశిస్తున్నారు. అందుచే యేజంటు వెంటనే యిందులో జోక్యము కలిగించుకొని షేకుసాబు విషయంలో న్యాయాన్ని కలిగిస్తూ సస్పెండులో యుంచినకాలానికి జీతమిచ్చేలాగున చేయాల్సినదిగా యీ సభవారు కోరుచున్నారు.

(2) గుంతకల్ అసిస్టెంటు ఇంజనీరు బాధలను చీఫ్ ఇంజనీరుకు తెలియ చేయగా డి. యి. రెండు సారులు విచారణ చేసిన తరువాత కూడా వారి కష్టములు ఎక్కువవటంచే తిరిగి పై అధికారికి అపీలు చేసినా ఇంత వరకు విచారణ చేయకుండుట ఈ సభవారు నిరసించుచూ, చీఫ్ ఇంజనీరు వెంటనే విచారణ చేయవలెనని కోరుచున్నారు.

బిట్రగుంట

రైల్వే కార్మికులు జులై 27 వ తేదీన కాంగార్ మైదానములో బ్రహ్మాండమైన సభజరిపారు. ఈ క్రింది తీర్మానములంగీకరించబడినాయి.

(1) ధరలు 100 కి 100 పాళ్లుపెరిగినాయి కాబట్టి 200 లోపుగా జీతంతీయువారందరికీ గూడా డియర్‌నెస్ అలవెన్సును 10 రూ॥ల చొప్పున యివ్వాలి, జీతాలలో 100 కి 20 చొప్పున హెచ్చించవలెనని, రైల్వేబోర్డుని, ఏజంటును, జనరల్ మేనేజరును, కోరుచున్నారు.

(2) ఏజంటు, జనరల్ మేనేజరు గారలు రైల్వే కూలీలందరికీ అందుబాటులో 'సంత'లను ఏర్పాటు చేస్తామని వాగ్దానమిచ్చియూ నెరవేర్చనందుకు అసమ్మతి తెలుపుచున్నారు. వొపెన్-లైన్-స్టాఫ్‌కు కూడా అందుబాటులో వుండేటట్లు 'సంత'లు అన్ని ముఖ్య కేంద్రాలలో పెట్టాలని కోరుచున్నారు. ఇవి ఏర్పరచేలోగా, నెల్లూరు వెళ్ళి సరుకులు తెచ్చుకొనేందుకు కనీసం, 40 కి తక్కువగాకుండా తాత్కాలికపు ప్యాసుల నీయవలసిందని ఈ సభవారు కోరుచున్నారు.

(3) వర్తకు లందరూ ఒక్కటై ధరలు పెంచడంవలన రైల్వే కార్మికులు కనీస జీవితస్థాయిని కూడ నిలబెట్టుకోలేక పోవుచున్నారు. అందుచే తీవ్ర అసంతృప్తి వ్యాపించుచున్నది. నెల్లూరు జిల్లా కలక్టర్ వెంటనే ఈ విషయంలో చర్య తీసుకోవాలని ఈ సభవారు కోరుచున్నారు.

గుంటకల్

యం. యస్. యం. రైల్వే పనివారలసంఘపు గుంటకల్ బ్రాంచి యాజమాన్యన జులై 27 వ తేదీన యుద్ధఅలవెన్సు దినోత్సవం జరిగింది. సభకు ముందు పెద్ద ఊరేగింపు జరిగింది. బ్రాంచికార్యదర్శి కామ్రేడ్ యం. గోవిందులు సభకు అధ్యక్షత వహించారు. ఈ క్రిందితీర్మానములు ప్యాసయినవి.

రైల్వే కార్మికులు

1. రైల్వే బోర్డుపైన ఒత్తిడి తీసుకువచ్చి, 150 రూపాయల లోపు జీతము తీయు వారందరికి వెంటనే 10 రూపాల అలవెన్సు చొప్పున ఇచ్చునట్లు చేయించాలని, అ. భా. రైల్వే పనివారల సమ్మేళనాన్ని ఈ సభవారు కోరుతున్నారు.

(2) అధికలాభాలనుఅరికట్ట నందుకు ప్రభుత్వంపై అసమ్మతి తెలియజేస్తూ, చౌక డిపోలను పెట్టించాలని, ధరల కంట్రోలు విషయంలో తగుచర్య వెంటనే ప్రభుత్వం తీసుకోవాలని ఈ సభవారు కోరుచున్నారు.

(3) రైల్వే హెడ్డాఫీసులు కొన్ని గుంటకల్ మార్చడం మూలంగా స్థానిక వర్తకులు ధరలను పెంచారు. అందుచే కార్మికులకు ఆర్థిక బాధ హెచ్చయింది. కావున గుంటకల్ రైల్వే కార్మికులకందరకూ 100 కి 25 చొప్పున ప్రత్యేక అలవెన్సులని, ప్రభుత్వంపై ఒత్తిడి చేయవలసినదిగా యూనియన్ అధ్యక్షుని ఈ సభవారు కోరుచున్నారు.

(4) ఇచ్చట కలరా తీవ్రంగా వుండుటచే, కార్మికులూ కార్మికులపై ఆధారపడిన తదితర బంధువులూ ఈ వ్యాధికి గురికావచ్చు. అలాంటి బాధకు గురియైన కార్మికులకు అడిగినప్పుడు ఒక నెల అడ్వాన్సు జీతము ఇవ్వాలని జిల్లా అధికార్లను ఈ సభవారు కోరుచున్నారు.

పెరంబూర్

రైల్వేపనివారల 15 వ వార్షిక మహాసభ.

పై మహాసభ జులై 26 వ తేదీన జరిగింది. ఆర్. కుప్పుస్వామి నాయకర్ అధ్యక్షతను జరిగింది. 400 మంది కార్మికులు హాజరయ్యారు. సభకు ముందు గొప్ప ఊరేగింపు జరిగింది.

మాజీ మద్రాసు మేయర్ ఎర్రజెండా ఎగురవేశారు. "త్యాగానికి, సేవకు, ఐక్యతకు చిహ్నమే ఈ ఎర్రజెండా. హిందూదేశ కార్మికులు ప్రస్తుత యుద్ధములో, ఫాసిస్టు వ్యతిరేకశక్తులకు భారతదేశస్వాతంత్ర్యాన్ని పొందడానికి గాను, సహాయపడవలెనని ఉద్బోధించారు.

తమిళనాడు కమ్యూనిస్టుపార్టీ నాయకుడు మోహన కుమార మంగళం మహాసభను ప్రారంభించుతూ ఇలా చెప్పారు.

"ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించిందంటే, అది ప్రజల ఒత్తిడి వలననే. కమ్యూనిస్టులు ఇండియా స్వాతంత్ర్య లక్ష్యాన్ని, పీడిత ప్రజాసామాన్యాన్ని వదులుకోలేదు. పీడిత ప్రజలను కమ్యూనిస్టుపార్టీ ఎన్నటికీ విడువదు. భారత దేశ సంపూర్ణ స్వాతంత్ర్యము కొరకు నిరంతరం పోరాడుతూనే వుంటుంది. జపాను ఫాసిజాన్ని ఎదిరించుటద్వారానే మన స్వాతంత్ర్యాన్ని కూడా సంపాదించుకొంటాం."

తర్వాత బ్రాంచి కార్యదర్శి జంబులింగంగారు నివేదికను చదివారు.

సభాధ్యక్షులు కుప్పుస్వామి నాయకర్ గారు "అధికారులు పనివారల హక్కులను సంతృప్తికరంగా అంగీకరించుటలేదు, ఈ వైఖరి వల్లకార్మికులలో అసంతృప్తి చెలరేగుతుంది." అని తెలియజేశారు.

టాడీటాపర్సు యూనియను కార్యదర్శి మురుగేశన్, కోయంబత్తూర్ టెక్స్టైల్సు లోని కార్మికసంఘ కార్యదర్శి ఎస్. రామయ్య గారలు కూడా మాట్లాడారు.

ఈ క్రింది తీర్మానాలు ప్యాసయినాయి.

(1) సోవియటు, చైనాలుఇతరదేశాలతో కలసి చేయుచున్న ఈ యుద్ధం ధర్మయుద్ధమనీ, హిందూ దేశం తన యావచ్ఛక్తినీ దురాక్రమణను ఎదిరించడానికి ధారపోయాలంటే జాతీయ ప్రభుత్వం ఏర్పరచాలనీ, అందుకోసం ఈ దేశంలోని ప్రముఖ పార్టీలతో ప్రభుత్వం రాజీపడాలనీ, ఈ విషయంలో బ్రిటిషు లేబరు పార్టీ వైఖరి అసంతృప్తికరంగా వుందనీ ఈ సభవారు తీర్మానించుచున్నారు.

(2) రాజకీయ ఖైదీల విడుదల విషయంలో ప్రభుత్వం హృదయపూర్వకంగా పని చేయలేదు. ఫేసిస్టు వ్యతిరేక ఖైదీలందరినీ విడిచిపెట్టాలని ఈ సభవారు కోరుచున్నారు.

(3) అధికారులకు తమ కష్టాలను గురించి తెలియ జెప్పుకునే విషయంలో, బ్రాంచీలకు హక్కులేదని రైల్వే అధికారులు నిషేధించారు. స్థానిక కష్టాలను, దైనందిన కష్టాలను తక్షణం తెలియజేసుకునే హక్కు- దీనివల్ల నశించుతుంది. అందుచే అనవసర కాలవ్యయం జరుగుతుంది. అధ్యక్షుడుగాని, లేక సి. యి. సి. చే నియమింప బడిన బాధ్యత గల కమిటీ మాత్రమే ఇప్పుడు కష్టాలను గురించి, తెలియ జేయవలసి వస్తుంది. అందుచే ఈ పద్ధతి కార్మికులలో ద్వేషాన్ని హెచ్చింప జేస్తుంది. అందుచే సి. యి. సి. ని, రైల్వే అధికారులపై బ్రాంచీలకై ఈ హక్కు నీయవలసినదిగా ఒత్తిడి తెమ్మని ఈ సభవారు కోరుచున్నారు.

(4) సి. యి. సి. తీర్మానాలతో ఏకీభవించుతూ, రైల్వే మిలటరైజ్డ్ యూనిటుల రేషను ఎలవెన్సులో కులభేదాలుగానిజాతిభేధాలుగాని, చూపరాదని ఈ సభవారు కోరు చున్నారు. అలాంటి విభేదాలుయుద్ధ ప్రయత్నాలనుకుంటు పడచేస్తాయి రైల్వే బోర్డు రైల్వే కార్మికులకు ఈ క్రిందిహక్కులను ఈ యవలసిందిగా కోరుచున్నారు.

(1) యూనిటులో చేరినా చేరకపోయినా అందరికీ 100 కి 25 చొ॥న జీతం హెచ్చించాలి.

(2) అందరికీ రు 22-8-0 రేషను ఎలవెన్సు ఈయాలి.

(3) ప్రతి అర్ధ సంవత్సరానికి, ఒక నెల బోనసు ఇవ్వాలి.

(4) యూనిటులలో చేరినవారికి ఎ. ఆర్. పి. ఎలవెన్సు ఇయ్యాలి.

(5) తక్కువ జీతాలు పొందే మీనియల్ స్టాఫ్ కూడా మిలటరీ రాంకు ప్రొమోషన్లు ఇవ్వాలి.

(6) శత్రువు చర్యల మూలకంగా నష్టపడిన కార్మికులకు గాని కార్మిక కుటుంబాలకుగాని 100 కి 100 కి నష్టపరిహారం ఈయాలి. ఇది మిలటరీ జీతం ఆధారం చేసుకొని ఈయాలి. అనగా జీతం 100 కి 25 మిలటరీ ఎలవెన్సు, రేషను ఎలవెన్సు, ధరలు పెరగడంవలన ఇచ్చే ఎలవెన్సు- ఇవన్నీ కల్పువాకోలి.

(7) మిలటరీ క్రమశిక్షణ పేరుతో పనినుండి కూలీలను తొలగించరాదు.

(8) యుద్ధంవలన చనిపోయిన మీనియల్ స్టాఫ్ కార్మికుల కుటుంబాలకు పోషణకై అలవెన్సు ఇయ్యాలి.

పై కోర్కెలను రైల్వేబోర్డు, ప్రభుత్వమూ అంగీకరించునట్లు ఆలిండియా రైల్వే మెన్సుఫెడరేషను ఒత్తిడి తేవాలని ఈ సభవారు కోరుచున్నారు.

(5) లక్నో రైల్వే వర్కుషాపు కార్మికుల కోర్కెలకు సానుభూతి తెలుపుతూ, ఈ క్రింది కోర్కెలను రైల్వే బోర్డు ఈయవలసినదిగా ఈ సభవారు కోరుచున్నారు.

(1) మద్రాసు 'బి' ఏరియాను, 'ఏ' ఏరియాతో కలిపి యుద్ధ ఎలవెన్సు (డియరెనెస్ ఎలవెన్సు) ఈయాలి. (మిగతా 4 వ పేజీలో)

ధరలకంట్రోల్ - ఆందోళన

అఖిలభారత కిసాన్ నాయకుల ప్రకటనానుసారం ఆంధ్రదేశ మంతటా ధరల కంట్రోలు దినం జరుపబడింది. ప్రజలుఊరేగింపులు, బహిరంగ సభలద్వారా అధిక లాభాల దోపిడిని అరికట్టాలనిన అవసరాన్ని ఎలుగెత్తి చాటారు.

బెజవాడ

సాయంత్రం 4 గంటలకు భారత కమ్యూనిష్టుపార్టీ పట్టణ కమిటీ నాయకత్వాన అరందేలు పేట నుంచి ఊరేగింపు బయలు దేరింది. రైల్వేకాలనీ, ఇంచిపేట గుండా గాంధీపార్కుకు చేరింది. ఊరేగింపులో 50స్త్రీలు సహా 3వందలు పాల్గొన్నారు. సభకు 6 వందలు ప్రజలు హాజరయ్యారు. కామ్రేడ్ వెంకటాచారి M. A అధ్యక్షత వహించారు. పేట రామారావు, యమ్. భాస్కరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ గార్లు ధరలను కంట్రోలు చేసి, అధిక లాభాల దోపిడిని అరికట్టాలని ఉపన్యసించారు. ప్రభుత్వాన్ని హెచ్చరించుతూ తీర్మానించబడింది.

పట్టణ యువజన సంఘం 10 వేల మందిచే సంతకాలు చేయించి అధికారులకు పిటీషన్లు పెట్టించింది. సబ్ కలెక్టరు వద్దకు డిప్యూటేషను పంపించింది. దానిఫలితంగా సబ్‌కలెక్టరు గారు రూపాయికి 7 శేర్ల వంతున అమ్మే 10 బియ్యం దుకాణాలు తెరిపిస్తారనీ, తక్కిన దినుసుల ఖరీదు కూడా నిర్ణయించ బడుతుందని తెలియ జేశారు కాని యివి యింత వరకు అమలు జరుపబడ లేదు.

ఏలూరు :

పట్టణ తాలూకా యువజన కార్మికసంఘాల యాజమాన్యాన ఉరేగింపు జరుపబడింది. టౌను హాలులో జరిగిన బహిరంగసభలో కామ్రేడ్స్ గారపాటి సత్యనారాయణ, కమ్ముల సుబ్బయ్య బనిసెట్టి అప్పారావుగార్లు ఉపన్యసించారు. ధరలను కంట్రోలు అధిక లాభాలను అరికట్టి, బీదప్రజలు బాధలు తొలగించి, ప్రజాశాంతిని కాపాడుటకు చౌకధరల డిపోలను తెరువాలని కోరుతూ తీర్మానించ బడెను.

కాకినాడ :

ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ యాజమాన్యాన 3 వందల మంది కూలీలు, స్త్రీలు విద్యార్థులలో ఉరేగింపు జరుప బడింది. 6 సెంటర్లలో సభలు జరుప బడ్డాయి. మొత్తం 2 వేలు ప్రజలు హాజరయ్యారు. సాయంత్రం వంతెన దిగువ సభకు పి. మార్కండేయరాజు గార్లు అధ్యక్షత వహించారు. కామ్రేడ్స్ పి. జగదాంబ, డి. సురేంద్ర, కె. అప్పారావు గార్లు ఉపన్యసించారు. ధరల కంట్రోలు చెయ్యాలనీ, కూలీనాయకుడైన సి. వి. కె.రావు గార్ని విడుదల చెయ్యాలనీ తీర్మానాలు చేయబడెను.

విజయనగరం :

విద్యార్థి సంఘము ఫాసిస్టు వ్యతిరేక కేంద్రముల నాయకత్వాన ఉదయం ఊరేగింపు జరిగింది. 600 మంది. సబ్ కలెక్టరు వద్దకు డిప్యుటేషన్ వెళ్లి 1000 సంతకాలతోవున్న పిటీషను సమర్పించారు. కలెక్టరు తాముచెయ్య గలిగినదంతా చేస్తామనీ, పోలీసువారి సహాయముతో ఎక్కువ ధరల కమ్మే వర్తకుల్ని పట్టి యిచ్చిన చర్యతీసి కొంటాననీ చెప్పారు. సాయంకాలం కె. గోవిందరావుగారి అధ్యక్షతను పార్కులో బహిరంగ సభజరిగింది. కామ్రేడ్ ఎం. భద్రంగారు ఉపన్యసించారు. "అధిక లాభాలను అరికట్టాలి" అనే నినాదంతో సభముగిసింది.

రాజమండ్రి :

పట్టణ ట్రేడ్ యూనియన్ యాజమాన్యాన శ్రద్ధానంద ఘాటులో బహిరంగ సభ జరిగింది. వి. గంగాధరరావుగారు అధ్యక్షత వహించారు. కామ్రేడ్స్ ప్రభాకరరావు లక్ష్మీపతి, ఏలూరి సూర్యారావు, అబ్దుల్ వారల్ గార్లు ఉపన్యసించారు కంట్రోలు ధరలు కఠినంగా అమలు జరుపాలనీ, ఉల్లంఘించిన వారిని శిక్షించి, ప్రభుత్వ దుకాణాలలో చౌక ధరలకు అమ్మించాలనీ తీర్మానించ బడెను.

అనంతపురం

26 వ తేదీ సాయంకాలం 400 విద్యార్థులు ఊరేగింపు జేసి బారల్స్ మైదానంలో కామ్రేడ్ సదాశివన్ అధ్యక్షతను బహిరంగ సభ జరుపబడింది. కామ్రేడ్స్ మల్లయ్య, గంగిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, అయ్యపరెడ్డిగార్లు ఉపన్యసించారు. ధరలను కంట్రోలు చేసి అధిక లాభాలను అరికట్టాలనీ, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడింది. ఇందుకొరకును, రాయలసీమలో వ్యాపించి వున్న కలరాను అరికట్టడానికి శానిటరీ స్టాఫ్‌ను యెక్కువ చేయాలని కోరుటకు కలెక్టరువద్దకు డెప్యుటేషన్ తీసికొని వెళ్ళబడంది. కలెక్టరుగారు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

కర్నూలు

ఈ రోజుకుముందు నాలుగు దినాలనుంచి వెయ్యి కరపత్రాలు పంచబడినాయి. కరపత్రములో కమ్యూనిష్టు పార్టీ పట్టణకమిటీ కార్యదర్శి, ముస్లిం లీగ్ అధ్యక్షులు, కాంగ్రెస్ సహాయ కార్యదర్శి, యన్. శంకరరెడ్డి M. L. C. గార్లు పట్టణ ప్రజలందరు ఈ దినాన్ని జయప్రదంగా జరపాలని కోరారు. కూలీ పేటలలో సభలు పెట్టి పేదల కష్టాలు తెలుపుతూ ఒక మెమోరాండం పంపుటకు అందరూ సంతకాలు చెయ్యాలని కోరబడ్డారు. మొత్తం 1500 ప్రజలు మెమోరాండంలో సంతకాలు జేసారు. దానిలో జీవితావసరాలగు వస్తువుల ధరలు కంట్రోలు చేసి ప్రతిచోట ప్రభుత్వం చౌక ధరల డిపోలు పెట్టాలని కోరబడింది.

26 వ తేది బస్సు స్టాండు వద్ద ముస్లింలీగ్ అధ్యక్షులైన ఖలీలుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింద. కామ్రేడ్ సి. పుల్లారెడ్డిగారు దిన ప్రాముఖ్యతను తెలుపుతూ, బీదల కష్టాలను వివరించి, దేశానికి రానున్న జపాన్ ఫాసిస్టు రాక్షసుల అపాయాన్ని గమనించి షాహుకార్లు, ప్రభుత్వము, బీదల సహకారము పొందవలయునని ఉపన్యసించారు. స్వతంత్ర భారత్‌కు, వీర చైనాకు, సోవియట్ రష్యాకు జేజేలతో సభ ముగిసింది.

కడప

తాలూకా కిసాన్ సభ యాజమాన్యాన కడప పట్టణంలో 26 వ తేదీ అధిక ధరలకు అసమ్మతి తెలుపుతూ వూరేగింపు జరుపబడినది. పోష్టాఫీసు మైదానంలో జిల్లా రైతు సంఘ కార్యదర్శి వై. ఆదినారాయణరెడ్డి అధ్యక్షతను బహిరంగ సభ జరుపబడింది. 8 వందల ప్రజలు హాజరయ్యారు. కామ్రేడ్స్, మోకా వెంకట సుబ్బయ్య, వర్ధన్‌గార్లు ఉపన్యసించారు. అధిక ధరలను అరికట్టాలనియూ, బీదలగు రైతులు, కూలీల కష్టాలను తీర్చాలనియు తీర్మానించ బడెను.

వెంకటగిరి

ఈ పట్టణంలో యువజన సంఘ యాజమాన్యాన జెండా చౌకులో సభ జరిగింది. బి. రామనాదంగారు ఉపన్యసించారు.

నెల్లూరు జిల్లా అల్లూరు, ఇందుపూరు గ్రామాలలో అధిక ధరలను ఖండించుతూ సభలు జరిగాయి. కామ్రేడ్స్ దశయ్య, ఎ. రంగయ్య, బి. శంకరయ్యగార్లు ఉపన్యసించారు.

కడప జిల్లా పెద్ద బోదనం, జంపాలపల్లె గ్రామాలలో సభలు జరిగాయి. మొదటి స్థలములో రామిరెడ్డిగారు, యన్. నరసింహం గార్లు, రెండో గ్రామంలో సి. తిరకయ్యగారును ఉపన్యసించారు.

రామచంద్రపురం :

విద్యార్థి సంఘం యాజమాన్యాన ఉరేగింపు, బహిరంగ సభ జరుపబడింది, ధరలను కంట్రోలు చేయాలి, అధిక లాభాలను అరికట్టాలి, అని తీర్మానించి తహసీల్దారుకు పంపారు.

నాయుడు గూడెం :

గ్రామ యువజన సంఘం తరఫున బహిరంగసభ జరుప బడింది. అధిక ధరలను అరికట్టాలనీ, ప్రభుత్వమే చౌక ధరలకుఅమ్మే డిపోలను స్థాపించాలనీ తీర్మానించబడింది.

కవుతరం

గ్రామంలో వడ్లమూడి బ్రహ్మానందరావు గారి అధ్యక్షతను కూలీలు, రైతులు సమావేశమయి అదే విధంగా తీర్మానించారు.

మైలవరం

గ్రామంలో ఊరేగింపు, బహిరంగ సభ జరుపబడెను. 200 ప్రజలు రివెన్యూ యిన్‌స్పెక్టరు వద్దకు వెళ్ళి అర్జీ యిచ్చారు. అతడు అర్జీని తీసికొన నిరాకరించుటచే జిల్లా అధికారులకు పంపబడింది.

హనుమంతపుర అగ్రహారం

హనుమంతపుర అగ్రహారం (గడ్డిపాడు) గ్రామంలో కూలీ సంఘం సభ జరిపి, ధరలను కంట్రోలు చేయాలనీ, తీర్మానించబడెను.

అంకాలమ్మ గూడూరు

అంకాలమ్మ గూడూరు (పులివెందుల తాలూకా) గ్రామంలో పొన్నతోట వెంకటరెడ్డి గారి అధ్యక్షతను సభ జరిగింది. అధిక లాభాలను అరికట్టాలనీ, ప్రభుత్వమే డిపోలను పెట్టి చవుక ధరలకు అమ్మాలని తీర్మానించబడెను.

నరసారావుపేట

పట్టణం అన్ని మూలల 7 బహిరంగసభలు జరుపబడ్డాయి. జులై 26 వ తేదీ ఊరేగింపు, సభ జరుపబడెను. 27 వ తేది ఉదయం 600 మంది కూలీలు ఊరేగింపుతో డిప్యూటీ కలెక్టరు వద్దకు ఆకలి యాత్ర జరిపిరి. కలెక్టరు తాను చేయగలిగినదంతా చేసెదననిరి.

28 ఉదయం కోలవెన్ను రామకోటీశ్వరరావు M. L. A., షేక్ అబ్దుల్ నబీ సాహెబు (ముస్లిం లీగ్ కార్యదర్శి), శ్రీ గిరిరాజు సత్యనారాయణ, కృష్ణమూర్తిగార్లు డిప్యూటీ కలెక్టరు, తహశీల్‌దారు, మాజిస్ట్రేటు, కమీషనర్లను కలసికొనిరి, చాలాసేపు చర్చించాక కలెక్టరుగారు తాము ఒక చౌక ధరల డిపోను యేర్పాటు చేస్తామని, మ్యునిసిపాలిటీచే కూడ పెట్టించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.

ప్రస్తుతము కిరసనాయిలు కంట్రోలు ధరకు చిల్లరగా అమ్మటకు యువజన సంఘానికిచ్చెద మనిరి. తెల్ల కాగితములు ప్రభుత్వం తరఫున తెప్పించి యువజన సంఘానికి కంట్రోలు ధరకు యిచ్చెద మనిరి. ధరల సలహా సంఘంలోకి యువజన సంఘ ప్రతినిధిని తీసికొంటా మన్నారు.

తోట్లవల్లూరు, వీరులపాడు గ్రామాల్లో కూడ అధిక ధరల నిరసనదినం జరుపబడింది.

నెల్లూరు

పాకీ పనివారి సభ తోటపాళెములో జరిగింది. అధిక లాభాలను అరికట్టి, ప్రభుత్వం చౌక ధరల షాపులను పెట్టించాలని తీర్మానించబడింది.

ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం

పశ్చిమ గోదావరి జిల్లాలో కామ్రేడ్స్ మైలవరపు రామారావు, చిలుకూరి సుబ్బారావు, కొమ్మూరి విశ్వనాథంగార్లు ఆచంట గ్రామంలో జులై 21 వ తేదీన బయలుదేరి జిన్నూరు, వాలమర్రు, బల్లిపాడు, నవుడూరు, వేంద్ర గ్రామాలలో ఫాసిష్టు వ్యతిరేక ప్రచారం బుర్ర కథల ద్వారా చేశారు. ఒక్కొక్క చోట వెయ్యినుండి రెండువేలదాక ప్రజలు హాజరై విన్నారు. ప్రపంచ పరిస్థితులను సులువుగా అర్థం చేసికొంటున్నారు.

రాజమహేంద్రవరం

శ్రద్ధానందఘాటులో కామ్రేడ్ వీరఘంట గంగాధరరావుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగెను. అధ్యక్షుడు కమ్యూనిష్టు పార్టీ చరిత్రను తెలిపి, ప్రభుత్వం నిషేధించడానికి కారణము ప్రజా ఒత్తిడి అనియు, జపాను దుండగీడులనుంచి మాతృ భూమిని రక్షించుకోడానికి ప్రథమ శ్రేణిలో వున్న దేశభక్తులే కమ్యూనిష్టు లగుటచేతనే ననియు తెలిపారు. ఇంక జైళ్ళలో వున్న కమ్యూనిష్టులను, ఫాసిస్టు వ్యతిరేకులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు. ముంగండ అవంతీ ప్రెస్‌ను తిరిగి విశ్వ సాహిత్య గ్రంథమండలి వారికి యిచ్చివేయాలని కోరారు. చల్లపల్లి యెస్టేటు దౌర్జన్యాలను ఖండించారు.

తుళ్ళూరు

గుంటూరు తాలూకా తుళ్లూరు కామ్రేడ్స్, బుర్ర కథలు జులై 26 వ తేదీన వడ్డమాను గ్రామంలో చెప్పారు. 8 వందలు ప్రజలు విన్నారు. సులభంగా ప్రపంచ పరిస్థితులు అర్థమయ్యాయి. రష్యా యెడల సానుభూతిని చూపుతున్నారు: జర్మనీ, జపానులను ప్రజా విరోధులుగా భావించుతున్నారు.

అమలాపురం

పాకీపనివారల సంఘం

జులై 19 వ తేదీన పాకీపనివారల సంఘం ఏర్పరచబడింది. 22 వ తేదీన బోర్డు ప్రసిడెంటు, శానిటరీ ఇనస్పెక్టర్లూ, ఆరుగురు పనివారలను డ్యూటీలేని సమయంలో చెరువులోని నాచు తీయమని చెప్పిరి. పనివారలు తమడ్యూటీకాలంలో తప్ప ఇతరకాలములో పనిచేయమని నిరాకరించిరి.అంత బోర్డు అధ్యక్షులు (కాంగ్రెసు పార్టీతరఫున ఎన్నుకోబడినవాడు కూడా) ఆర్గురను పనిలోనుండి తొలగించారు. పైగా కార్మికుల తరఫున రాయబారం వెళ్ళిన ప్రతినిధులను దూషించిరి. కొత్తవారిని పనిలో పెట్టుకొనిరి. పైగా కొత్తవారిని తొలగించబడిన పనివారలు కొట్ట ప్రయత్నించుచున్నారని పోలీసులకు రిపోర్టులు ఇస్తున్నామని బెదరించ మొదలుపెట్టారు.

చల్లపల్లి ఎస్టేటుదురంతాలయెడ అసమ్మతి

ముత్రాసుల వశంలోనున్న భూమిని జమీందారీ మనుష్యులు ఆక్రమించడం అన్యాయము అక్రమమూ అనీ; 144 సెక్షనును అమలుపరచుట తెలివితక్కువ యని; పోలీసుల అత్యాచారం సహింపరానిదని; వెంటనే నిష్పక్షపాత విచారణ జరిపించాలని; పోరాటంలో పాల్గొన్న రైతులకు వర్కర్లకు దివితాలూకా కాంగ్రెసు తరఫున తమ సానుభూతిని తెలియజేయుచున్నామని; తమ న్యాయమైన హక్కును సంపాదించుటకు ప్రాణ త్యాగానికైనా రైతులు సంసిద్ధపడవలెననీ; దివితాలూకా కాంగ్రెసుసంఘ కార్యదర్శి శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తిగారు వ్రాయుచున్నారు.

• • •

బందరు తాలూకా రైతు సంఘ కార్యనిర్వాహకవర్గము జమీందారుగారి చర్యలను ఖండించుచూ, ఆ భూములను రైతుల కిప్పించవలెననీ, అరస్టయిన వారిని విడుదల చేయవలెననీ - కోరుచూ 25-7-42 వ తేదీన తీర్మానించింది.

• • •

భట్లపెనుమర్రు గ్రామంలో 28-7-42 న దేవినేని చంద్రశేఖరరావుగారి అధ్యక్షతను జరిగిన బహిరంగసభలో ముత్రాసులకు భూమిని ఇప్పించాలని, జమీందారీ నిరంకుశ చర్యలను ప్రభుత్వం అరికట్టాలని,ఖైదీలందరిని విడిచి కేసులుఉపసంహరించుకోవాలని,తీర్మానించబడింది.

పై కోర్కెల ననుసరించి వ్రాయబడిన అర్జీమీద ప్రజలు సంతకం చేశారు. అది కలెక్టరుకు పంపబడింది.

• • •


గుంటూరు జిల్లా వ్యవసాయ కూలీసంఘ కార్యదర్శి యస్. పి. మల్లికార్జున శర్మగారు, మంగళాపురం తగాదా చరిత్రను గురించి వివరించుతూ, ఈ క్రింది హెచ్చరిక గావించుతున్నారు.

"....ప్రభుత్వచర్యపట్ల తీవ్ర అసమ్మతి తెలియజేయండి. కేసు ఉపసంహరించుకొని వారిభూమిని వారికిచ్చివేయవలెనని, గ్రామ గ్రామాన, ప్రతి పట్టణంలోను, వ్యవసాయ కూలీలందరు సభ జరపండి. మంగళాపురపు క్రిమినల్ కేసు ఖర్చులకు వ్యవసాయ కూలీలు డబ్బుప్రోవుచేసి, జిల్లాఆఫీసుకు పంపండి. అసమ్మతి ప్రకటనలను, కృష్ణాజిల్లాకలెక్టరుకు, మద్రాసు ప్రభుత్వానికి జిల్లా ఆఫీసుకు తెలియజేయండి."

• • •

ముత్రాసుల న్యాయమైన హక్కులను నిలబెట్టడానికి ప్రభుత్వంఛోక్యం కలుగజేసుకోవాలనేతీర్మానాన్నిబందరు డివిజనల్ డిప్యూటీ కలెక్టరుకు అందజేయాలి అని

దివితాలూకా కాంగ్రెసు రైతు యువజన వర్కర్ల సమావేశం నిశ్చయించింది.



ఈ నిర్ణయంప్రకారం వర్కర్లు ఊరేగింపుతో అవనిగడ్డ తాలూకా ఆఫీసుకు వెళ్ళారు. ఒక పోలీసుఇనస్పెక్టరు వీరిని ఆఫీసులోనికి రానీయనని, వెళ్ళిపొమ్మని, లేకపోతే లాఠీచార్జీ చేస్తానని బెదిరించాడు. మరో సబ్‌ఇనస్పెక్టరు లోపలికి పొమ్మని చెప్పాడు. ఇంతలో అవనిగడ్డ సబ్‌ఇనస్పెక్టరుతో మాట్లాడిన కలెక్టరు పరుగెత్తుకవచ్చి "మీతో మాట్లాడను. వెళ్ళిపొండి." అని అరచాడు.

ఈ విషయమై అసమ్మతి తెలియజేస్తూ వర్కర్లు బహిరంగసభ జరిపారు. మద్రాసు ప్రభుత్వానికి టెలిగ్రాం పంపారు. జిల్లాకలెక్టరుకు కూడా ఈ విషయం తెలియబరిచారు.

• • •

గన్నవరం తాలూకా రైతు సంఘ కార్యనిర్వాహక వర్గం 22-7-42 న సమావేశమై, మంగళాపురం ఘర్షణలోని ఖైదీలందరిపై కేసులను ఉపసంహరించుకోవాలని, భూములను ముత్రాసులకు ఈయాలని, అలా జరుపనిచో రైతులలో తీవ్ర అసంతృప్తి ప్రబలుతుందని జిల్లాకలెక్టరును హెచ్చరించుతూ తీర్మానం గావించారు.

• • •

బందరు తాలూకా రైతు సంఘ కార్యనిర్వాహకవర్గసభ్యులు ది 25-7-42 తేదీన సమావేశమై యీ దిగువ తీర్మానములు గావించిరి.

1. మద్రాసుప్రభుత్వమువారు జమీందారీ ప్రాంతములోని ఎ. రిజిష్టరుదాఖలా భూములు బీదరైతులు సాగుచేసుకొనవచ్చునని ప్రకటించియున్నారు. అట్లే జమీందారీ ఏరియాలోని బి. రిజిష్టరు దాఖలాభూములుకూడ సాగుకుగాను బీదలకు యిచ్చునట్లు జమీందార్లను వొత్తిడి తేవలసినదిగా ప్రభుత్వమువారిని, అట్లు చేయుట దేశమునందు అధిక ఆహారోత్పత్తికేసాయపడును గాన సాగుచేయుటకనుమతింపవలసినదిగా జమీందార్లను కోరుచున్నాము.

2. సాగుకు లాయకీ అయినభూములను వెంటనే ఆయకట్టులో చేర్చుకోవలసినదిగా శ్రీ కలెక్టరుగారిని ఎగ్జిక్యూటివ్ యింజనీయరుగారిని కోరుచున్నారు.

• • •

గన్నవరం తాలూకా రైతుసంఘ కార్యనిర్వాహకవర్గం 22-7-42 తేదీన సమావేశమై యీ క్రింది తీర్మానములను ఆమోదించింది.

1. మద్రాసుప్రభుత్వమువారు ఆహార పదార్థము వుత్పత్తి ఎక్కువచేయు నిమిత్తము పంపిన సర్క్యులర్లను క్రింది వుద్యోగులు పాటించనందుకు వారిచర్యలను నిరసించుతూ, వారు అలసభావము వదలి వెంటనే పని ప్రారంభించేట్లు చేయవలసినదిగా మద్రాసు ప్రభుత్వము వారిని యీ సభవారు కోరుచున్నారు.

2. ఆయకట్టులో చేరవలసిన భూములను గురించి ప్రతిగ్రామము తిరిగి పిటీషన్లు తీసుకొనుటకు విశదముగా లెక్కలు తయారుచేయుటకు యీ క్రిందివారిని కమిటీగా నియమించడమైనది.

1. బొబ్బా వెంకటసుబ్బయ్యగారు (కన్వీనరు)
2. పాటిబండ్ల హనుమంతరావుగారు
3. అక్కినేని రామలింగేశ్వరరావుగారు
4. సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళుగారు

కావున ప్రతి గ్రామ రైతుసంఘము వారూ వీరికి తగిన సహాయము చేసి పని చురుకుగా సాగగలందులకు తోడ్పడవలసినదిగా యీ సభవారు గ్రామరైతు సంఘములను హెచ్చరించుచున్నారు.

* * *

కోయలకుంట్ల జిల్లా రైతుసంఘ సహాయకార్యదర్శి వి. రామశాస్త్రిగారు తాలూకా కాంగ్రెసు అధ్యక్షుడు వి. నారాయణస్వామిగారు, తాలూకాలో కడప కర్నూలు కాలువక్రింద పండింపబడుచున్న భూములకు నీటిపారుదల టిక్కెట్లు ఇచ్చే అధికారమును ఎక్జిక్యూటివు ఇంజనీరుగారి దగ్గరనుంచి, మునుపటివలెనే గ్రామోద్యోగులకు ఇప్పించిన రైతులకు అనవసర పోస్టలు, పెనాల్టీల బాధలు తప్పుట కవకాశముండునను విషయమునను, మధ్యతరగతుల అధికలాభాలు అరికట్టుటకు ప్రభుత్వము చౌకధరల ఆహారపదార్థాల డిపోలను పెట్టు విషయమునను, తాలూకాలోని గ్రామాల్లో పర్యటనముచేసి మహజర్లు తయారుచేయించి ఒకటి జిల్లాకలెక్టరుగార్కి పంపుచు మరియొకటి తహశీలుదారుగార్కి తీసికొని 30-7-42 వ తేదీని రాయబారము తీసికొని పోయారు. తహశీలుదారుగారు నీరు పారుదల టిక్కెట్లు నాకు సంబంధము లేదనియు, అయినా కలెక్టరుగారికి తెలుపుతాననియు, సాధ్యమైనంతవరకు ధరలు కంట్రోలు చేయుచున్నామనియు చెప్పిరి.

• • •

మునగాల ఎస్టేటులో గత సంవత్సరం అనావృష్టివలన పంటలు పండలేదు. పండినది కాస్తా శిస్తులక్రింద చెల్లిపోయింది. శిస్తు రెమిషన్ ఇవ్వమని ఎంతకోరినా ఈయలేదు. ఇంతేగాక పండినకాస్త ధాన్యము వర్తకులవద్దకు చేరినది. ఇపుడు కరువు రోజులలో రూపాయికి 4 మానికల జొన్నలు 5 మానికలు వడ్లు అమ్ముచున్నారు. ఒక్కొక్కసారి ఇంకా తక్కువ అమ్ముచున్నారు.

కాబట్టి ఈ దోపిడిని అరికట్టి ఇతర ప్రాంతాలనుండి ధాన్యంతెప్పించి సప్లయి చేయవలసిందిగా కలెక్టరుగారిని కోరుచున్నానని, కె. కోటయ్యగారు వ్రాయుచున్నారు.

"అధిక ఆహార ఉత్పత్తికి గాను ప్రభుత్వం, మాగాణికి లాకీగా యున్న బంజరుభూములను రైతు స్వంతభూములను కూడ సాగుచేయాలనీ. వాటిపై అధిక నీటి తీరువలు విధించమనియు ప్రభుత్వం ప్రకటన చేసింది. కాని మాగాణికి లాకీగా నున్న మెట్టభూములను మాగాణీ చేసికొనడానికి పరిమిషన్ ఇచ్చుటలేదు. అలాంటిభూమి గుంటూరు జిల్లా వెల్లటూరిలో 120 ఎకరాలు, దోనేపూడిలో 100 ఎకరాలు వుంది. పరిమిషన్‌కోసం రైతులు పిటీషన్లు రాయబారాలు జరిపినా, ఇంతవరకు పరిమిషన్ ఇచ్చియుండలేదు. ఈ విషయమై జిల్లా రైతుసంఘం తగు శ్రద్ధ తీసుకొనవలెనని కోరుచున్నాము."

వెనిగళ్ళ సత్యనారాయణ
వెనిగళ్ళ రామకోటయ్య

• • •

బెజవాడ తాలూకా రైతు వర్కింగుకమిటీ 25-7-42 తేదీన సమావేశమై ఈ క్రింది తీర్మానాలను గావించినది.

(1) జమిందారీ బంజరుభూములను కూడ అధిక ఆహార ఉత్పత్తికిగాను రైతుల కిప్పించాలి.

(2) ధరల కంట్రోలు అమలుపరచవలెనని, రైతులు పండించే పంటకు ఇంతకు తక్కువగాకుండా అన్నిధరలు ఉండేటట్లు కనీసధరలు నిర్ణయించాలని, షాహుకార్లు ఇంతకన్న హెచ్చుధరకు అమ్మగూడదని కంట్రోలు చేయాలి. చౌక డిపోలను కూడ ప్రభుత్వమే స్థాపించాలి.

(3) అధికోత్పత్తి చేయడంమూలంగా ఇదివరకటి బీళ్ళు మొదలైనవాటిలో పశువుల గడ్డి తగ్గిపోతుంది గనుక ఫారెస్టు పుల్లరి తీసివేయాలి. జమీందారీ ఏరియాలో గూడ ఫారెస్టుపుల్లరి రద్దుచేయించాలి.

(4) జమీందారీ బంజరు భూముల గురించి విచారించడానికి ఒక కమిటీ నిర్ణయించబడింది.

• • •

ఆత్మకూరు తాలూకా రైతుమహాసభ సెప్టెంబరు నెలాఖరులోగా జరుగుతుంది. ఈ సభను నిర్వహించడానికి జి. సి. కొండయ్యగారిని ఆర్గనైజరుగా నిర్ణయించారు.సభను జయప్రదంగా జరపటానికి సర్వవిధముల సహాయ పడవలసిందని కొండయ్యగారు కోరుచున్నారు.

ప్రపంచ యుద్ధసమీక్ష

సోవియటు - జర్మను యుద్ధం భీషణ రూపం తాల్చింది, రోస్టోవ్ పతనానంతరం, జర్మన్ సేనలుమరింత దక్షిణంగాను ఆగ్నేయం గాను చొచ్చుకు పోయాయి. నేడు యుద్ధం, 'కుష్చేవకయా' "సాలస్క్" అను ప్రాంతాలలో జరుగుతున్నది. జర్మన్లు ఈ ప్రాంతంలో ఏ ఆశయంతో ముందుకుపోతున్నారు?

నల్ల సముద్రంలో, "నొవోరొసిస్క్" అను రేవు పట్టణం చాల ప్రాముఖ్యమైనది. సెబాస్టపోల్ పతనం తర్వాత, సోవియటు నౌకా దళం ఇచట కేంద్రీకరించ బడింది. నొవోరొసిస్క్ నుండి, క్రాస్నోడార్ గుండా "స్టాలిన్ గ్రాడ్"కు ఒక రైలు మార్గం పోతున్నది. ఈ రైలు మార్గాన్ని మరొక రైలుమార్గం "రోస్టోవ్" నుండి వచ్చికలుస్తుంది. "రోస్టోవ్, నుండి వచ్చి కలిసే రైలుమార్గంలో "బాటైస్క్" "కుష్చేవకయా" అను ప్రదేశాలకు జర్మన్లు చొచ్చుకు వచ్చారు. వీటి నుండి రెండు దిశలకు జర్మన్లు పోవాలని వాంఛించుతున్నారు. ఒకటి కాస్పియన్ సముద్ర పశ్చిమ తీరాన ఉన్న 'అస్ట్రఖాన్.' వాల్గానది ఇచ్చటనే కాస్పియన్ సముద్రంలో పడుతుంది. రోస్టావ్ పతనం వలన దీని ప్రాముఖ్యత హెచ్చింది. రోస్టోవ్ పతనం వలన, నూనెగనుల కేంద్రమగు గ్రోజ్నీ (కాస్పియన్ సముద్ర తీరానికి పశ్చిమంగా ఉంది.) నుండి రోస్టోవ్ వచ్చే పైప్‌లైన్ పనికిరాకుండా పోయింది. యూరోపియను రష్యాకు నూనెసప్లయి చేయాలంటే, ఇపుడు గ్రోజ్నీనుండి కాస్పియన్ సముద్రం గుండా "అస్ట్రఖాన్"కు చేర్చాలి. అల్లే 'బాకూ'నుండి వచ్చేనూనె కూడ ఇక గ్రోజ్నీకి వెళ్లదు. "అస్ట్రఖాన్"కు వెళుతుంది. "అస్ట్రఖాన్" నుండి వాల్గానది ఒడ్డున "సారటావ్" అనే పట్టణానికి రైలుమార్గం వుంది. ఈ మార్గం గుండా, సారటావ్‌కు, సారటావ్ నుండి మాస్కోకు నూనెసప్లయి చేయవలసి వుంటుంది. అందు చేతనే జర్మన్లు "అస్ట్రఖాను"కు పోవ ప్రయత్నించు చున్నారు. క్రాస్నడార్ - స్టాలిన్ గ్రాడ్ రైల్వేను సాలస్క్ వద్ద భేధించుటలో కూడా ఇదే ఉద్దేశ్యమై వుండవచ్చు. టైమ్సు పత్రిక కూడ ఇలావ్రాసింది. "నూనెబావులను కొల్లను రక్షించు కొనడం గాదు సమస్య. నూనె వెళ్లే మార్గాలను రక్షించు కొనడమే ఇప్పటి సమస్య." ఇపుడు సాల్స్క్ ప్రాంతంలో భీకరయుద్ధం జరుగుతోంది. వ్రోలిచేరస్క్యాను చుట్టు ముట్టామని జర్మన్లు అంటున్నారు. మరొక ప్రక్క బాటైస్క్ నుండి క్రాస్నడార్‌గుండా నల్ల సముద్రతీరానికి జర్మన్లు పోవాలని ప్రయత్నించడం నొవొరొసిస్క్‌కు ప్రమాదం గల్గించాలనే.

స్టాలిన్‌గ్రాడ్‌నుండి రోస్టోవ్‌కు ప్రవహించే డాన్ నది ఒడ్డున వున్న స్మిల్యాంస్కా వద్ద జర్మన్లు నదిని దాటారని గతవారం చూచాం, ఇపుడుకూడ అచట తీవ్ర యుద్ధం జరుగుతున్నది.

ఇక ఉత్తరాన డాన్ నదీతీరాన 'క్లెట్స్కాయా'వద్ద జర్మనుల ధాటిని రష్యన్ సైన్యాలు నిలబెట్టుతున్నాయి. ఇటు చొచ్చుకు రావడం స్టాలిన్‌గ్రాడ్‌ను పట్టుకోవడానికని స్పష్టమే. ఇంతేగాదు, పైన చెప్పినట్లు బాకూ, గ్రోజ్నీలనుండి అస్ట్రఖాన్ గుండా కొనిపోయే నూనెను అరికట్టాలంటే, వాల్గా నదినికూడా దాటాలి. అందుకనే హిట్లరు ఈ విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఒక్క దెబ్బతో తక్కిన రష్యాను కాకాసస్‌నుండి విడదీయాలని, నూనె సప్లయిలు చేరకుండా చేయాలని ప్రయత్నించుచున్నాడు.

ఈ ప్రయత్నాలను అరికట్టడానికి సోవియటు సైనికులు దృఢ సంకల్పంతో వున్నారు. ఇప్పటి వరకు ఆత్మ రక్షణా యుద్ధాలతో తిరోగమించుతున్న సైన్యాలిక ఒక అడుగుకూడా వెనుక వేయరాదని నిశ్చయం చేసికొన్నట్లు కన్పించుచున్నది. రష్యనుదిజర్వ్‌సేనలు వచ్చి చేరుచున్నాయి. కామ్రేడ్ స్టాలిన్ "ప్రతి సైనికుడూ, ప్రతి ఆఫీసరూ ఒక్క అడుగు వెనుకకు వేయకుండా పోరాడి విజయమో, మృత్యువో పొందాలని" ఆజ్ఞాపించాడు. దీనిపై వ్యాఖ్యచేస్తూ, "రెడ్ స్టార్" యిలా వ్రాస్తున్నది. "మన డిఫెన్సు కమిసారును మిలటరీ నాయకుడునూ అగు కామ్రేడ్ స్టాలిన్ ఒకడుగుకూడా వెనుక వేయరాదని ఆజ్ఞాపించాడు. ఈ కర్తవ్యాన్ని నిర్వహించడం అంటే తుచ్ఛ శత్రువుల చేతిలో నాశనమైపోకుండా మన దేశాన్ని భద్రపరచడం అన్నమాట. విజయానికి గ్యారంటీ అన్నమాట" మాస్కో రేడియో 31వ తేదీన యిలా ప్రబోధించింది. "రెడ్‌ఆర్మీ సైనికులారా! నిర్దాక్షిణ్యంగా ఉండండి. క్రూర శత్రువు, మన యావత్ ప్రజలకు ప్రమాదం కల్గించుతున్నాడు. శత్రువును దునుమాడడానికి ఒకే మార్గం వుంది. యుద్ధంలో నిర్దాక్షిణ్యంగా ఉండండి. నిర్దయాపూర్వకంగా జర్మను దోపిడి గాండ్రను హతమార్చండి. మీరంటే దేశానికి విశ్వాసముంది. ఆ విశ్వాసానికి తగినట్లు ప్రవర్తించండి."

ఇదే రోజున ఇజ్వెస్టియా ఇలా ఉద్బోధించింది. "హిట్లరు గుంపుల ఒత్తిడిని ప్రతిఘటన అనే ఇనుప గోడతో అడ్డగించాలి. ఒకడుగు కూడా వెనక్కి వేయవద్దు అంటోంది. మాతృ భూమి. ఒక్కడుగు కూడా వెనక్కి వేయవద్దు - అంటోంది జాతి. ఒక్కడుగు కూడ వెనక్కి వేయవద్దు - అంటున్నాడు కామ్రేడ్ స్టాలిన్."

"మన స్వాతంత్ర్య ప్రజలుగా వుందామా లేక జర్మను బానిసలుగా వుందామా? మీ బొందిలో ఊపిరి ఉన్నంతవరకు. మీ కాళ్ళలో సత్తువ ఉన్నంత వరకు, మీ హస్తాలు తుపాకి నెత్తగల్గి నంతవరకు, మీరు పోరాడాలి. ఇంకా వెనుకకు పోవడం పనికిరాదు. ప్రతి అడుగునూ రక్షించుకోవాలి. రెడ్ ఆర్మీ శక్తివంతమైన దెబ్బలతో జర్మను సైన్యాలు బలహీన పడ్డాయి. మళ్లీ మనం జర్మను సైన్యాలను ఆపగలం........ శత్రువును వెనక్కి తరిమి, హతమార్చి, యీ క్రూర రాక్షసి మన భూమిలో లేకుండా తుడిచివేయడం మన విధి"

రెడ్ స్టార్ పత్రిక కూడా యిదే ధోరణిలో ఉద్బోధించింది. "చావనన్నా చావాలిగాని ఒక అడుగుకూడా వెనక్కి వేయరాదు."

ఈ ఉద్బోధలను అక్షరాలా రెడ్ ఆర్మీ అమలు పరచుతుందని మనం విశ్వసింపవచ్చు.

రెండవ రంగం

రాబర్టు మాగిడాఫ్, అను అమెరికను విలేఖరి మాస్కో నుండి బ్రాడ్‌కాస్టు చేస్తూ ఇలా అన్నాడు, "సోవియటు ప్రధాన ప్రదేశాలలో జర్మనీ దెబ్బగొట్టు తున్నది. అయినా ఇచట భీతిలేదు. సోవియటుకు విజయం తప్పదని వారు భావించుతున్నారు. వారికి మన సహాయం కావాలి. అంటే రెండవ రంగాన్ని తెరవాలని వారి అపేక్ష"

మార్క్‌సులీవాన్ "యూరప్‌పై దండయాత్ర చేయడానికి తగినంత నౌకా సౌకర్యం వుంది." అని అన్నాడు. బ్రిటిషు పత్రికలన్నీ ఈ విషయమే చర్చించాయి. ఒక బ్రిటిషు పత్రిక లేగాదు. యావత్ప్రపంచమూ ఈ సమస్యపై ఉడుకెత్తి పోతున్నది. కాని బ్రిటిషు అధికారధోరణి బాగుండలేదు. కమ్యూనిష్టు సభ్యుడు గలాచర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ సర్‌స్టాఫర్డుక్రిప్సు "రెండవ రంగం తెరచే ఉద్దేశ్యం" మాత్రము కలదని అన్నాడు. టైమ్సు పత్రిక మొదలు డైలీ హెరాల్డు వరకు, ప్రజల మీటింగుల వల్ల మిలటరీ స్ట్రాటజీ యేర్పడదంటూ యేవో సాకులు చెబుతున్నాయి. న్యూస్ క్రానికల్ అన్నట్లు "స్ట్రాటజీ ప్రభుత్వాని దన్నమాట నిజమే. కాని యుద్ధాన్ని జయించవలసిన బాధ్యత ప్రజలది."

అమెరికాలోని కార్మిక సంఘం (సి. ఐ. ఓ.) ఒక పెటీషనును రెండవ రంగం తెరవాలని రూజువెల్టుకు అందించింది. అస్ట్రేలియా ఆయుధకర్మాగార కార్మికులుకూడా యిలాగే కోరారు. జనరల్ సికోర్స్కీ (పోలండు) కూడ తిరిగి రెండవ రంగాన్ని తెరవాలన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. క్రిప్సు ఇచ్చిన జవాబుకు అమెరికాలో మిలటరీ నిపుణులు కూడ అసంతృప్తి చెందారు. యుద్ధాలలో నిమగ్నులైన సైనికుల భార్యలు, తల్లులు, సోదరీమణులు, స్త్రీ కార్మికులు - వీరందరి తరపున ఒక రాయబార వర్గం బ్రిటిషు ప్రభుత్వ కార్యాలయాన్ని సందర్శించి రెండవ రంగాన్ని తెరువమని కోరింది.

సుప్రసిద్ధ రచయిత ఇల్యా ఎహరెన్‌బర్గు యిలా వ్రాశాడు. "ఫ్రెంచి తీరాన్నంతా హిట్లరు ఖాళీ చేశాడు. ఇది హిట్లరు గుడ్డితనమో, దూరదృష్టో మరి నాల్గువారాలలో తేలిపోతుంది. కానిరష్యన్లు ఆశ్చర్య నిమగ్నులై "మా మిత్రులేరి?" అని ప్రశ్నించుతున్నారు."

రెండవ రంగాన్ని తెరవడానికి చెప్పే సాకులలో అర్థం లేదు. ఫ్రెంచి, నార్వే ప్రజలలో విప్లవ భావాలు ప్రజ్వరిల్లుతున్నాయి. డిగాలీ అనుచరులు మొదలు కమ్యూనిష్టుల వరకు అందరూ హిట్లరును కూలద్రోయ సిద్ధంగా వున్నారు. ఈ విషయాన్నే మాజీ ఫ్రెంచి శాసన సభ్యుడు (డెప్యూటీ) నూ, సోషలిష్టునూ అగు ఆండ్రీ ఫిలిప్పు తెలియజేశాడు.

ప్రపంచ దృష్టి అంతా - ఆందోళన అంతా రెండవ రంగం పైననే వుంది. రెండవ రంగం యేర్పరచితే తత్ఫలితంగా ఫ్రాంసు, నార్వే మొదలగు ఆక్రమిత దేశాలలో విప్లవాలను యెలా యెదుర్కోవాలని సంకోచించే సామ్రాజ్య వాదుల ఆటలు ప్రపంచ ప్రజలు సాగనివ్వరు. ఈ నెలాఖరునో, సెప్టెంబరు ప్రారంభంలోనో రెండవ రంగం ప్రారంభింపక తప్పదు. తత్ఫలితంగా జర్మన్లకు యీ సంవత్సరంలోనే రష్యాలో ఓటమి తప్పదు.

బెజవాడ విద్యార్థి సంఘం

సప్తమ వార్షికోత్సవము

రామమోహన లైబ్రరీలో ఆగష్టు 1, 2. శని ఆది వారాలలో జరిగింది.

1 వ తారీఖున ఉదయము 8 గంటలకు పలువురు విద్యార్థులు విద్యార్థి జెండాలతో విద్యార్థి సంఘ ఆఫీసు నుండి పురవీధులగుండా ఫాసిష్టు వ్యతిరేక నినాదములతో ఊరేగింపు జేసారు. 9½ గంటలకు విద్యార్థి చౌకలో కామ్రేడ్ టి. వెంకటేశ్వరరావుచే విద్యార్థి పతాకము ఎగుర వేయబడెను.

తరువాత 11 గంటలకు విద్యార్థి సంఘ సాధారణ సమావేశము ప్రారంభమైనది. సమావేశమునకు కామ్రేడ్ M. రాధాకృష్ణ M. A. (ఆంధ్రరాష్ట్రవిద్యార్థి సంఘ కార్యదర్శి) అధ్యక్షత వహించారు. ఆర్. వి. రంగారావు సాంవత్సరిక నివేదికను చదివారు.

తరువాత యుద్ధము జాతీయ ప్రతిఘటన: యుద్ధ కాలపు విద్యార్థుల కోర్కెలు, రాజకీయఖైదీల విడుదలను గురించిన తీర్మానములు చేయబడెను.

తదుపరి నూతన సంవత్సర కార్మ నిర్వాహకవర్గమునకు యెన్నికలు జరిగాయి. ఐ. ముత్యాలు కార్యదర్శిగాను, ఎ. బి. గంగాధర్ సహాయ కార్యదర్శిగాను యెన్నుకోబడిరి. మహాసభ సాయంత్రం తిరిగి 4-30 గంటలకు కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ బి. ఏ. (ఆనర్సు) బి. ఎల్., అధ్యక్షతను ప్రారంభమైనది. కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావు మహాసభను ప్రారంభిస్తూ విద్యాలయాలు మొదలగువాటిని గురించి విపులంగా తెలిపారు.

తదుపరి మహా సభలో యం. రాధాకృష్ణ ఎం. ఏ., పి. సుందరం, పి. శ్రీరాములు ఉపన్యసించిన పిదప ఫాసిస్టు వ్యతిరేక గీతాలతో సభ ముగిసింది.

రెండవ రోజు వైజ్ఞానిక మహాసభ కార్యక్రమములో గల ఆటల పోటీలు జయప్రదంగా జరిగాయి. మహాసభ సాయింత్రము 4 గంటలకు గోపరాజు రామచంద్రరావు యమ్. ఎ. గారి అధ్యక్షతన జరిగిగింది. విశ్వనాధ సత్యనారాయణ గారు యమ్. ఎ. సభను ప్రారంభించిన పిదప త్రిపురనేని రామస్వామిగారు, ఉపన్య సించారు.

సభలో వయోజన విద్యా ప్రచారంపై నిషేధము తొలగాలి, అను తీర్మానం యేకగ్రీవంగా ఆమోదించబడింది.

ఐ. ముత్యాం, కార్యదర్శి.

Published by Katragadda Rajagopala Rao and Printed by The Popular Printers, Bezwada.

END OF ISSUE